మెప్మా డీఆర్‌డీఏ పంచాయితీ..!

- నగర పంచాయతీ.. మళ్లీ గ్రామ పంచాయతీ
- డీఆర్‌డీఏ పరిధిలోకి స్వయం సహాయక సంఘాలు
- మెప్మా లాగిన్ లాక్.. డీఆర్‌డీఏకి ఆదేశాలు లేవట..!
- పొదుపు మహిళలకు అందని రుణాలు


పామిడిలో సమావేశమైన ఆర్‌పీలు

పామిడి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ నగర పంచాయతీ అయింది. దీన్ని ప్రజలు వ్యతిరేకించడంతో మూడేళ్ల క్రితం మళ్లీ గ్రామ పంచాయతీగానే మార్చారు. ఈ కారణంగా స్వయం సహాయక సంఘాలను మెప్మా నుంచి డీఆర్‌డీఏకి బదిలీ చేశారు. మెప్మా వ్యవస్థను రద్దు చేసి, సీఓ చంద్రశేఖర్‌ను బదిలీ చేశారు. కానీ పాలనాపరమైన సమస్యలను పరిష్కరించడం లేదు. మెప్మా, డీఆర్‌డీఏ శాఖల సమన్వయ లోపం కారణంగా స్వయం సహాయక సంఘాలు ఇబ్బంది పడుతున్నాయి. రుణాలను తిరిగి చెల్లించినా కొత్త రుణాలు ఇవ్వడం లేదు. ఎవరిని అడిగినా సమస్య పరిష్కారం కావడం లేదని మహిళలు వాపోతున్నారు.

ఎవరిని అడిగినా...

పామిడిలో ప్రగతి పట్టణ సమాఖ్యలో సుమారు 485 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటి పరిధిలో 19 మంది ఆర్పీలు పని చేస్తున్నారు. ప్రతిరోజూ సమావేశాలు నిర్వహించి, సంఘ సభ్యుల స్వయం ఉపాధికి తోడ్పడుతున్నారు. కానీ ఇటీవల మెప్మా లాగిన్‌లు లాక్ అయ్యాయి. దీంతో సిబ్బంది దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. రుణాల మంజూరుకు మెప్మా సీఓ లేదా డీఆర్‌డీఏ ఏపీఎం స్థాయి అధికారులు సంతకం చేయాల్సి ఉంది. పామిడి స్వయం సహాయక సంఘాలకు సంతకాలు ఎవరు పెట్టాలో తెలియని పరిస్థితి. పలు సంఘాలు నూతన రుణాలకు డాక్యుమెంట్లు సిద్ధం చేసుకున్నాయి. మెప్మా సీఓ బదిలీ అయ్యారు. డీఆర్‌డీఏ అధికారులను అడిగితే తమకు ఆదేశాలు లేవని అంటున్నారని బాధితులు స్వయం సహాయక సంఘాల సభ్యులు వాపోతున్నారు. పామిడి తిరిగి గ్రామ పంచాయతీగా మారిందని, దీంతో మెప్మా వ్యవస్థను రద్దు చేసి డీఆర్‌డీఏకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశామని మెప్మా పీడీ విశ్వజ్యోతి తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య ఈ సమస్యపై స్పందించలేదు.

ఇబ్బంది పడుతున్నాం..



పామిడి నగర పంచాయతీ నుంచి గ్రామ పంచాయతీగా మారి సుమారు మూడేళ్లు దాటింది. ఎలాంటి సమాచారం లేకుండా అధికారులు మెప్మా వ్యవస్థను రద్దు చేశారు. దీంతో స్వయం సహాయక సంఘాల లావాదేవీలు స్తంభించి పోయాయి. కొత్త రుణాలు మంజూరుకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. మెప్మా అధికారులను అడిగితే డీఆర్‌డీ ఏ వారికి అప్పగించామంటున్నారు. డీఆర్‌డీఏ వారిని అడిగితే పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు.

- నిర్మల, ప్రగతి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, పామిడి

అప్పులు చేస్తున్నాం..



స్వయం సహాయక సంఘం సభ్యులు తీసుకున్న రుణాన్ని చెల్లించాము. కొత్త రుణం తీసుకునేందుకు అన్ని పేపర్లను సిద్ధం చేశాము. ఆర్‌పీలను అడిగితే ఏదేదో చెబుతున్నారు. మరికొన్ని రోజులు ఆగమంటున్నారు. కొత్త లోన్లు వస్తాయని చెప్పి వెనక్కు పంపుతున్నారు. దిక్కుతోచక బయట అప్పులు చేయాల్సి వస్తోంది.

- రమాబాయి, శ్రీలక్ష్మి గణపతి మహిళా సంఘం సభ్యురాలు, పామిడి



ఏంటో ఈ విడ్డూరం..!

మూతపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు కొనుగోలు బాధ్యతలు
మద్దతు ధరలేక నష్టపోతున్న వేరుశనగ రైతులు
సమాచారం తెలిపినా స్పందించని రాష్ట్ర అధికారులు

6

ఉండలేరు.. వెళ్లలేరు..!

- అసౌకర్యాల మధ్య చదువులు
- ఇరుకు గదుల్లో 20మంది విద్యార్థులు
- ఆగిపోయిన హాస్టల్ భవన నిర్మాణ పనులు
- దీనావస్థలో కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల హాస్టల్

6



గ్రావెల్ హీట్..!

- నేడు క్షేత్రస్థాయికి అధికారులు
- వైసీపీ నాయకుడి దందాపై విచారణ
- నిరూపణకు సిద్ధమైన టీడీపీ నాయకులు


పెద్దపేట వద్ద ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

యాడికి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు గ్రావెల్‌ను అక్రమంగా వాడినట్లు ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు విచారణకు సిద్ధమయ్యారు. క్షేత్రస్థాయికి గురువారం వస్తున్నామని సమాచారం ఇచ్చారు. వైసీపీ హయాంలో బొంబాయి రమేష్‌నాయుడు అనుమతులు లేకుండా లే అవుట్లు వేశారని, అంతర్గత రోడ్లకు ప్రభుత్వ భూముల్లోని గ్రావెల్‌ను అక్రమంగా తరలించారని టీడీపీ నాయకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వైసీపీ నాయకుడికి, ఫిర్యాదిదారులకు వివిధ శాఖల అధికారులు నోటీసులు పంపించారు.

ఇక్కడే... అక్రమాలు

యాడికి గ్రామ పంచాయతీ సర్వే నంబర్లు 510-3, 15, 748-బీ, 7 తదితర 27 ఎకరాల భూములలో అక్రమ లే అవుట్లకు, అంతర్గత రోడ్లకు గ్రావెల్‌ను అక్రమంగా తరలించినట్లు ఫిర్యాదు వచ్చిన అంశాన్ని అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు. భైరవకొండ, పెద్దపేట ఆంజనేయస్వామిమాన్యం భూములు, తిరుణాంపల్లి వంక తదితర ప్రభుత్వ భూములలో మట్టిని గడిచిన ఐదేళ్లు అక్రమంగా రవాణా చేసినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 28న విచారణకు వస్తున్నామని పేర్కొన్నారు. మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసుశాఖ అధికారులు విచారిస్తారని, హాజరుకావాలని సూచించారు. పెద్దపేట ఆంజనేయస్వామి మాన్యంలో గ్రావెల్ తరలింపుతో అక్కడున్న హైటెన్షన్ విద్యుత్ స్తంభం కూలిపోయేలా ఉంది. దీనిపై పవర్ గ్రిడ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సిందే.

హైటెన్షన్

గ్రావెల్ దందాను నిరూపించడానికి టీడీపీ నాయకులు సిద్ధమయ్యారు. వైసీపీ హయాంలో అక్రమ కేసులు పెట్టి వేధించినందున తీవ్ర ఆగ్రహంతో ఉన్న టీడీపీ నాయకులు.. వైసీపీ నాయకుల అక్రమాలను నిరూపించాలని భావిస్తున్నారు. విచారణకు వైసీపీ మండల కన్వీనర్ వస్తాడా? రాడా? అనే చర్చ జరుగుతోంది. విచారణ జరిగే ప్రాంతాలకు రెండు పార్టీల నాయకులు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

టీచర్లపై యాప్స్ భారం తగ్గిస్తాం

లీడర్‌షిప్ ట్రైనింగ్‌లో ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్


మాట్లాడుతున్న కోన శశిధర్

అనంతపురం విద్య/అనంతపురం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): త్వరలో టీచర్లపై ఉన్న యాప్స్ భారానికి స్వస్తి చెబుతామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్ పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన కలెక్టర్ వినోద్‌కుమార్, ఆర్‌జేడీ శామ్యూల్, డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీసీ నాగరాజుతో కలిసి సీఆర్‌ఐటీ కళాశాలలో జరుగుతున్న లీడర్‌షిప్ ట్రైనింగ్ కేంద్రాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో సుమారు 45 వరకూ యాప్స్ ఉన్నాయని, త్వరలో అన్నింటికి స్వస్తి చెప్పి, ఒకటి లేదా రెండు మాత్రమే తీసుకొస్తామన్నారు. స్కూళ్ల, ఉపాధ్యాయులు, విద్యార్థుల సమగ్ర సమాచారం అందులో ఉంచేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. గవర్నమెంట్ స్కూళ్లలో అన్నీ ఉన్నాయని, మంచి ఫర్నిచర్, భవనాలు, ఐఎఫ్‌పీ ప్యానల్స్ ఇలా అన్నీ ఉన్నా క్వాలిటీ కొరవడుతోందన్నారు. ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకుంటే ఉత్తమ ఫలితాలు సాధ్యమవుతాయన్నారు. అందు కోసమే ఈ లీడర్‌షిప్ ట్రైనింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మంచి పురోగతి సాధిస్తే సమగ్రశిక్ష ఏపీసీలుగా అవకాశం ఇస్తామని తెలిపారు. ట్యాబ్స్ పనితీరు ఎలా ఉందని...? వాటిపై ఎలా ముందుకెళ్దామని ప్రధానోపాధ్యాయులు, ఇతర అధికారుల అభిప్రాయం అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరిగే మెగా పేరెంట్స్ మీటింగ్స్‌ను పండుగ వాతావరణంలో నిర్వహించాలన్నారు. జిల్లా కలెక్టర్ సైతం దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

అపార్‌లో అనంతను ఆదర్శంగా నిలపండి

అపార్ అప్డేషన్‌లో అనంత జిల్లాను ఆదర్శంగా నిలపాలని విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కోన శశిధర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో బుధవారం రాత్రి విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలతో ఆయన కలెక్టరు వినోద్‌కుమార్‌తో కలిసి సమీక్షించారు. ఈసందర్భంగా కోనశశిధర్ మాట్లాడుతూ అపార్ చాలా ముఖ్యమన్న విషయాన్ని ప్రతిఒక్కరు గుర్తించి, బాధ్యతగా పూర్తి చేయాలన్నారు. టీచర్ల ముఖహాజరు వందశాతం ఉండాలన్నారు. అనంతపురంరూరల్, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల్లో హాజరు తక్కువగా ఉందన్నారు. ప్రతిరోజు హాజరుపర్యవేక్షించాలని ఎంఈఓలను ఆదేశించారు.

అనుచిత సలహా..!

- చిక్కుల్లో డీసీహెచ్‌ఎస్ రవికుమార్
- వాయిస్ కాల్‌పై షోకాజ్ నోటీసులు


డాక్టర్ రవికుమార్

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డీసీహెచ్‌ఎస్ డాక్టరు రవికుమార్ మెడకు వాయిస్‌కాల్ ఉచ్చు బిగుస్తోంది. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవిపై మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఒకరు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తెలుగునాడు మెడికల్ ఉద్యోగుల సంఘం పేరుతో ఆయన ఫిర్యాదు చేయడంతో ఆ సంఘం నాయకులు స్పందించారు. సబ్ యూనిట్ ఆఫీసర్‌కు తమ సంఘంతో సంబంధం లేదని ప్రకటించారు. మరోవైపు ఆ అధికారిపై డీఎంహెచ్‌ఓతోపాటు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు కలెక్టర్‌కు వివిధ రకాల ఫిర్యాదులు చేశారు. దీంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవికుమార్ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతో జరగబోయే పరిణామాలు, అందులోంచి ఎలా బయటపడాలో సూచనలు, సలహాలు ఇచ్చారు. 'డీఎంహెచ్‌ఓపై చేసిన ఫిర్యాదులకు తగిన ఆధారాలు సిద్ధం చేసుకోండి. మీది జోనల్ పోస్టు కాబట్టి కలెక్టర్ చర్యలు తీసుకునేందుకు లేదు. గతంలో మా శాఖలో ఇద్దరిపై కలెక్టర్లు గౌతమి రెడ్డి, నాగలక్ష్మి చర్యలు తీసుకుంటే వారు కోర్టుకు వెళ్లి రద్దు చేయించుకున్నారు..' అని సలహాలు ఇచ్చారు. ఎలా బయటపడాలో తనకు సలహాలు ఇచ్చిన డీసీహెచ్‌ఎస్‌కు సబ్ యూనిట్ ఆఫీసర్ షాక్ ఇచ్చారు. కాల్ రికార్డింగ్‌ను సోషల్ మీడియాలో పెట్టి ఝలక్ ఇచ్చారు. దీంతో కలెక్టర్ సీరియస్ అయ్యారు. సబ్ యూనిట్ ఆఫీసర్‌ను కడప ఆర్డీకి సరెండర్ చేశారు. ఆయన సేవలు జిల్లాలో అవసరం లేదని చెప్పారు. డీసీహెచ్‌ఎస్‌కు షోకాజ్ నోటీసు ఇచ్చారు. కాన్ఫిడెన్షియల్ వ్యవహారాల ను బహిర్గతం చేయడం, కలెక్టర్ చర్యలు తీసుకుంటే ఏం చేయాలో సలహాలు ఇవ్వడం వంటి వివాదాలు డీసీహెచ్‌ఎస్‌ను చుట్టుముట్టాయి. మునుముందు ఎలాంటి పరిణామాలు ఉంటాయోనన్న ఆందోళన వైద్య విధానపరిషత్‌లో నెలకొంది.

మెడికోను మింగిన ఒత్తిడి

ఏఎంసీ హాస్టల్ గదిలో ఉరి


కొడుకు శవం వద్ద కన్నీరుమున్నీరవుతున్న తల్లి శారద, బంధువులు


రోహిత్ (ఫైల్‌ఫొటో)

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): 'ఆలోచనలు వెంటాడుతున్నాయి. అయోమయంగా ఉంది. అందుకే చనిపోతున్నాను. నా చావుకు నేనే కారణం..' అని రాసి పెట్టి.. వైద్య విద్యార్థి వీర రోహిత్(21) ఉరి వేసుకున్నాడు. చదువుల ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఉరవకొండకు చెందిన శివప్రసాద్, శారద దంపతుల కుమారుడు వీర రోహిత్. వీరిద్దరూ ఎస్‌జీటీలు. శివప్రసాద్ ఉరవకొండ ఎస్‌ఎల్‌ఎన్ కాలనీలో యూపీ పాఠశాలలో, శారద ఆమిద్యాల ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. ఇద్దరూ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. కొడుకులు ఇద్దరూ డాక్టర్లు అవుతున్నారని తల్లిదండ్రులు మురిసిపోయారు. పెద్ద కుమారుడు రోహిత్ 2019లో అనంతపురం మెడికల్ కాలేజీలో అడ్మిషన్ పొందాడు. మొదటి సంవత్సరంలో ఒక సబ్జెక్ట్ ఫెయిల్ అయ్యాడు. ఆ తరువాత అన్నీ పాసవుతూ ఫైనల్ ఇయర్‌కు చేరుకున్నాడు.

గదిలో ఒక్కడే...

ఫైనల్ ఇయర్ కావడం, డిసెంబరులో పరీక్షల నేపథ్యంలో కాలేజీ హాస్టల్‌లోని ప్రత్యేక గదిలో ఒక్కడే ఉంటూ చదువుకునేవాడు. వేరే ప్రాంత కాలేజీలో ఎంబీబీఎస్ చేస్తున్న అతని తమ్ముడు బుధవారం ఉదయం నుంచి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో అనంతపురంలో ఉంటున్న తమ సమీప బంధువు ధీరజ్‌కు విషయం తెలియజేశాడు. సహ విద్యార్థులతో కలిసి ధీరజ్ కాలేజీ హాస్టల్‌కు రాత్రి 7 గంటల సమయంలో వెళ్లాడు. తలుపు తట్టినా స్పందన లేకపోవడంతో కిటికీ నుంచి చూశాడు. అప్పటికే వీర రోహిత్ ఉరికి వేలాడుతూ కనిపించాడు. దీంతో తలుపులు బద్ధలుకొట్టి రోహిత్‌ను కిందకు దించి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ శ్రీకాంత్ మెడికల్ కాలేజీ హాస్టల్‌ను సందర్శించి, విచారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉదయమే ఆత్మహత్య..?

రోహిత్ ఆత్మహత్యతో మెడికల్ కాలేజీలో పర్యవేక్షణ లోపం మరోమారు బయటపడింది. రోహిత్ ఉదయమే ఉరి వేసుకున్నట్లు కనిపిస్తోందని పోలీసులు అంటున్నారు. కానీ రాత్రి దాకా అతని గదివైపు ఎవరూ వెళ్లలేదు. రోహిత్ తమ్ముడు ఫోన్ చేశాకగానీ స్పందించలేదు. ప్రిన్సిపాల్ పనిమీద కర్నూలుకు వెళ్లారు. ఆత్మహత్యకు కారణమేమిటో కుటుంబ సభ్యులను అడిగే ప్రయత్నం చేస్తే.. వారు కన్నీరుమున్నీరయ్యారు. ఇబ్బంది పెట్టవద్దని రోహిత్ తండ్రి మీడియాకు విన్నవించారు. రోహిత్ తల్లి తల్లడిల్లిపోయారు. 'ఎంతపని చేశావు నాన్నా..' అంటూ కొడుకు మృతదేహంపై పడి గుండె పగిలేలా ఏడ్చారు. సహ విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు.

అదృశ్య ప్రేమలు

కలవరపెడుతున్న బాలికల వ్యవహారం

నగరంలో రెండు రోజుల్లో ముగ్గురు మాయం



అనంతపురం క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏమీ తెలియని వయసులో బాలికలు దారి తప్పుతున్నారు. బాగా చదువుకుని, భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాల్సింది పోయి.. ప్రేమ మాయలో పడుతున్నారు. తల్లిదండ్రులను వదిలేసి మాయమౌతున్నారు. అనంతపురం నగరంలో ఇటీవల బాలికల అదృశ్యం ఫిర్యాదులలో అత్యధికం ఇలాంటివే ఉన్నాయి. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు రోజుల వ్యవధిలో ముగ్గురు బాలికలు అదృశ్యమయ్యారు. జనశక్తి నగర్, నారాయణపురం, మారుతీ నగర్‌లో పదో తరగతి, ఇంటర్ చదువుతున్న బాలికలు మాయమయ్యారు. తన కోసం ఎదురు చూడవద్దని, వెతకవద్దని ఓ బాలిక లేఖ రాసిపెట్టి మరీ వెళ్లిపయింది. 'నాకు మా అన్న, నా లవర్.. ఇద్దరూ ఇష్టమే. రెండు కళ్లలో ఏ కన్ను కావాలంటే ఏం చెప్పగలం..? అందుకే బాయ్‌ఫ్రెండ్‌తో వెళ్లిపోతున్నా' అని ఓ బాలిక సినిమా లెవెల్లో లెటర్ రాసి పెట్టి మాయమైంది. ఆ బాలిక వయస్సు 17 ఏళ్లు కాగా, తీసుకెళ్లిన వ్యక్తి వయస్సు 34 ఏళ్లని సమాచారం. మాయమైన ముగ్గురిలో కేసు నమోదు చేయకనే ఓ బాలిక మిస్సింగ్‌ను పోలీసులు ఛేదించారని సమాచారం. ఇంత చిన్న వయసులో ప్రేమ ఏమిటని, మాయలో పడకుండా బాగా చదువుకోవాలని పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు సమాచారం. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం ఓ పదో తరగతి బాలిక అదృశ్యమైంది. పోలీసులు వెతికి పట్టుకుని.. ప్రేమ వ్యవహారమే కారణమని గుర్తించారు. కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

మహిళ అదృశ్యం వెనుక సీఐ డ్రైవర్

నగరంలో రెండు రోజుల క్రితం ఓ మహిళ అదృశ్యమయ్యారు. దీని వెనుక ఓ సీఐ వాహన డ్రైవర్ ఉన్నట్లు సమాచారం. నర్సుగా పనిచేస్తున్న ఆమెను సీఐ ప్రైవేటు డ్రైవర్ తీసుకెళ్లినట్లు తెలిసింది. పోలీసులు ఫోన్ చేసి విచారించగా, తాను తీసుకెళ్లలేదని బుకాయించాడట. ఆ ఇద్దరి మొబైల్ నంబర్లను పోలీసులు ట్రేస్ చేస్తే.. ఒకే చోట ఉన్నట్లు తేలిందట. దీంతో కాకమ్మ కబుర్లు కట్టిపెట్టి పోలీస్‌స్టేషనస్‌కు వస్తే బాగుంటుందని పోలీసులు హెచ్చరించినట్లు తెలిసింది.

సంగమేశ్వరుడికి కొత్త రథం



కూడేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జోడు లింగాల సంగమేశ్వరస్వామి విహరించేందుకు రూ.42 లక్షలతో నూతన రథం తయారీ పనులను ప్రారంభించారు. ఆలయ ఆవరణలో పూరాతన రథానికి అర్చకులు మహేష్, సీవీ స్వామి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలకు వినియోగించే పురాతన రథం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో రథాన్ని లాగే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా తాళ్లు కడుతున్నారు. ఈ క్రమంలో కొత్త రథాన్ని తయారు చేయడానికి భక్తులు విరాళాలను సమర్పించారు. అలా వచ్చిన రూ.42 లక్షలతో రథాన్ని తయారు చేయిస్తున్నారు. వచ్చే ఏడాది జరిగే బ్రహ్మోత్సవాలకు నూతన రథంలో పార్వతీ పరమేశ్వరులు విహరించేలా పనులు వేగంగా చేయిస్తామని పెద్దలు తెలిపారు. రథం తయారీ సమయంలో ఎటువంటి ఆటంకం కలగకుండా దీవించాలని స్వామి వారి వేడుకున్నారు. రెంటాల హరినాథ్, నిమ్మగల్లు బాబు, కుసాల నాగరాజు, రామదుర్గం కిష్టప్ప, కుమ్మరి వెంకటరాముడు, కుమ్మరి ఓబులప్ప, అంకే సంగప్ప తదితరులు పూజలో పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, కలెక్టర్

బొమ్మనహాళ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, సీఎంఓ టూర్ కో ఆర్డినేటర్ ఇక్బాల్ షకీల్, కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. నేమకల్లులో ఈ నెల 30న పించన్ల పంపిణీ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా గ్రామసభ ఏర్పాటు చేస్తున్నారు. ఆర్డీఓ వసంతబాబు, డీఎస్పీ రవిబాబు, తహసీల్దారు మునివేలు, ప్రత్యేక అధికారి తిప్పేస్వామి, ఎంపీడీఓ దాస్‌నాయక్, ఈఓపీఆర్డీ దాస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.,

న్యూస్‌బాక్స్

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

● పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్

అనంతపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ర్యాంప్ పథకంలో భాగంగా శుక్రవారం నుంచి నిర్వహించే ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించాలని పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరిశ్రమల శాఖ ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో క్షేత్ర స్థాయిలో సర్వే చేస్తారన్నారు. ఈ సర్వే కోసం ఎంఎస్ఎంఈ సర్వే అండ్ సపోర్ట్ అనే మొబైల్ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. ఈనెల 29 నుంచి వచ్చే ఏడాది జనవరి నెలాఖరు దాకా గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, పట్టణ ప్రాంతాల్లో వార్డు అమెనిటీ సెక్రటరీలు ఈ సర్వే చేస్తారన్నారు. ఈ సర్వే ద్వారా తయారీ, సేవ, వాణిజ్య రంగాల్లో అన్ని ఎంఎస్ఎంఈ సర్వే చేసి వాటిని డిజిటల్ ప్లాట్ ఫాంలోకి తీసుకొచ్చి, ఏపీ ఎంఎస్ఎంఈ వన్ పోర్టల్‌కు అనుసంధానం చేస్తారని వెల్లడించా రు. ఇందులో నమోదు కాని వ్యాపారాలను ఉద్యం, ఉద్యమ అసిస్ట్‌లో నమోదు చేయడం ఎంఎస్ఎంఈ ఫార్మలైజేషన్ ముఖ్యుద్దేశ్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఎంఎస్ఎంఈ అసోసియేషన్లు, ఇతర పరిశ్రమల అసోసియేషన్లు, వర్తక, వాణిజ్య సంఘాలు సహకరించాలని కోరారు.

అదానీతో విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

● సీపీఎం రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అదానీ కంపెనీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలన్నింటినీ తక్షణమే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయకుండా కూటమి ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం సబబు కాదని విమర్శించారు. గత ప్రభుత్వ అవినీతిపై రంకెలు వేస్తూ ఇపుడు అదానీకి తలవంచడమేంటని ప్రశ్నించారు. అమెరికా న్యాయస్థానంలో కేసు నమోదైన నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే వాటిని రద్దు చేయాల్సిన అవసరముందన్నారు.

ఎస్జీటీ అభ్యర్థుల కోసం... డిసెంబరు 29న వదాన్య ప్రతిభాపరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీకి సిద్ధమవుతున్న ఎస్జీటీ అభ్యర్థులకు వదాన్య సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆ సొసైటీ ఫౌండర్ అశోక్ పడపాటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సొసైటీ ఆధ్వర్యంలో 14 ఏళ్లుగా నిరుపేద నిరుద్యోగ ప్రతిభావంతులైన అభ్యర్థుల అభ్యున్నతే లక్ష్యంగా వదాన్య సొసైటీ వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా ప్రతి సంవత్సరం జిల్లా పరిషత్ పాఠశాలలోని 9,10 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలోనే ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని ఎస్జీటీ అభ్యర్థులకు డిసెంబరు 29న కొత్తచెరువు ప్రధాన కేంద్రంగా ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే ఈ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1500 మందిపైగా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 30లోగా www.vada anya.org లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు.

తిరుపతి ప్యాసింజరు పాక్షిక రద్దు

గుంతకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాయదుర్గం-కదిరిదేవరపల్లి రైల్వే స్టేషన్లలో యార్డు ఆధునికీకరణ పనుల కారణంగా తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి ప్యాసింజరు రైలును పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతి-కదిరిదేవరపల్లి ప్యాసింజరు (నం. 07589) రైలును డిసెంబరు 1నుంచి 31 వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచినట్లు తెలియజేశారు. ఆ తేదీల్లో గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో మాత్రమే ఈ రైలు నడవనుంది. అలాగే దీని తిరుగు ప్రయాణపు రైలు (నం. 07590) డిసెంబరు 2 నుంచి జనవరి 1వ తేదీ వరకూ గుంతకల్లు-కదిరిదేవరపల్లి సెక్షన్‌లో రద్దుపరచి గుంతకల్లు-తిరుపతి సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు.

ప్రశాంతంగా సివిల్స్ స్క్రీనింగ్ పరీక్ష

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సివిల్స్ ఉచిత శిక్షణకు సంబంధించి బుధవారం నిర్వహించిన స్క్రీనింగ్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 55 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు మొత్తం 57 మంది దరఖాస్తు చేసుకున్న ట్లు అధికారులు తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 37, శ్రీసత్యసాయి జిల్లాకు సంబంధించి 18 మంది అభ్యర్థు లు పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల ను అనంత జిల్లా అభ్యర్థులకు ఒక గది లో... శ్రీసత్యసాయి జిల్లా అభ్యర్థులకు మరో గదిలో పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలను బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ పరిశీలించారు. ఉత్తీర్ణత సాధించిన వారికి విజయవాడలోని బీసీ భవన్‌లో ఉచితంగా శిక్షణ ఇస్తారని ఆమె తెలిపారు. పరీక్షను శ్రీసత్యసాయి జిల్లా సూ పరింటెండెంట్ హరిత, ఏబీసీడబ్ల్యూఓ రంగమ్మ, వార్డెన్లు మారుతీ ప్రసాద్, రవీంద్రనాథ్ ఠాగూర్, మాధవి, స్టడీ సర్కిల్ కో-ఆర్డినేటర్ రవీంద్ర, లైబ్రేరియన్ శ్రీనివాసులు, సుబ్బయ్య, ప్రకాష్ తదితరులు పరిశీలించారు.

ఉండలేరు... పోలేరు..!

అసౌకర్యాల మధ్య ఆడపిల్లల చదువులు



ఆరుబయటే భోజనం తింటున్న విద్యార్థులు

- ఇరుకు గదుల్లో 20మంది విద్యార్థులు
- మొండి గోడల మధ్యనే భోజనాలు
- ఆగిపోయిన హాస్టల్ భవన నిర్మాణ పనులు
- పేదింటి బిడ్డలకు వసతి కష్టాలు
- దీనావస్థలో కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వసతి గృహం

అనంతపురం సెంట్రల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో సౌకర్యాలు లేక కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గదిలో 15 నుంచి 20 మంది వసతి పొందాల్సిన దుస్థితి నెలకొంది. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో మొండి గోడల మధ్యనే భోజనాలు చేయాల్సిన పరిస్థితి ఉంది. వ్యక్తిగత అవసరాలు తీర్చుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తోంది. పలు ఇబ్బందులతో స్నానాలు చేయకుండానే తరగతికి వెళ్లాల్సి వస్తోందని విద్యార్థినులు వాపోతున్నారు.

ఐదేళ్లుగా మొండి గోడల మధ్యే...

విద్యార్థుల శ్రేయస్సు, భద్రతను దృష్టిలో పెట్టుకుని కళాశాల ఆవరణలోనే హాస్టల్‌ను ఏర్పాటు చేశారు. ప్రారంభంలో పది గదులతో కూడిన భవనాన్ని నిర్మించి హాస్టల్‌ను ప్రారంభించారు. విద్యార్థుల సంఖ్య పెరగడంతో గదులు సరిపోవడంలేదు. దీంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో యూజీసీ, రూసా తదితర నిధులను సమీకరించి కొత్తభవనాల నిర్మాణాలు చేపట్టారు. సెమినార్ హాల్, అదనపు తరగతి గదుల భవనం పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. అయితే హాస్టల్ కోసం నిర్మిస్తున్న భవనాలు పిల్లర్లు, గోడలు, స్లాబుల వరకు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తిచేసి వినియోగంలోకి తేవాల్సి ఉండగా ఎన్నికలు రావడం, వైసీపీ అధికారాన్ని చేపట్టడంతో హాస్టల్ భవనాల నిర్మాణాలు ఆగిపోయాయి. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఐదేళ్లుగా మొండి గోడలమధ్యనే విద్యార్థులు వసతి పొందుతూ, భోజనం చేస్తున్నారు.

ప్రైవేట్ హాస్టళ్లకు విద్యార్థులు...

కళాశాల హాస్టల్లో సరిపడా గదులు లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లకు వెళ్తున్నారు. అడ్మిషన్ సమయంలో ఏదో రకంగా హాస్టల్ ఫీజులు చెల్లించి చేరిపోయారు. అయితే ఇక్కడి పరిస్థితులు భరించలేక, కట్టిన ఫీజులు వెనక్కితీసుకుని ప్రైవేట్ హాస్టళకు వెళ్తున్నారు. అయితే ప్రైవేట్ హాస్టళ్లలో భద్రతకు భరోసా లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. గత్యంతరం లేక బయటికి హాస్టల్లో చేర్పించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన భవనాలు నిర్మించాలని వేడుకుంటున్నారు.

ఒక్కో గదిలో 20 మంది..

కొత్త భవన నిర్మాణ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రాకపోవడంతో పాతభవనంలోనే విద్యార్థులు కాలం వెళ్లదీస్తున్నాం. ఒక్కో గదిలో 20 మంది వరకు వసతి పొందుతున్నారు. వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవాలన్నా, స్నానాలు చేయాలన్నా గంటల కొద్దీ వేచిచూడాల్సి వస్తోందని పలువురు విద్యార్థులు వాపోతున్నారు. దీంతో వారంలో ఒకటి, రెండు సార్లు మాత్రమే స్నానాలు చేస్తున్నామని, ఒక్కోసారి మొహం కడుక్కోవడానికి సమయం సరిపోక ఆలస్యంగా తరగతికి వెళ్తున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క భవనంలోనే 600 మంది వరకు వసతి పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

1600 మంది విద్యార్థినులు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలకు మంచి పేరుంది. ఇక్కడ డిగ్రీలో 15 రకాల కోర్సులు అందిస్తున్నారు. బాలికల ప్రత్యేక కళాశాలల కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల విద్యార్థినులు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఏటా దాదాపు 600మంది అడ్మిషన్ అవుతున్నారు. మూడు సంవత్సరాలు డిగ్రీ కోర్సుల్లో కలిపి 1600 మంది విద్యార్థినులు ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. వీరిలో అత్యధికంగా గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. మరోవైపు సరిపడా తరగతి గదుల్లేక షిఫ్టులవారిగా పాఠాలు బోధిస్తున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు.

కాళ్లరిగేలా తిరిగినా..

తమ కళాశాలలో అడ్మిషన్స్ పెరిగాయని, సరిపడా భవనాలు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, కళాశాల అధికారులు గత ప్రభుత్వానికి అనేక సార్లు మొరపెట్టుకున్నారు. అసంపూర్తిగా ఉన్న హాస్టల్ భవన నిర్మాణం పూర్తిచేయడానికి, అదనపు తరగతి భవనం నిర్మించేందుకు నిధులు ఇవ్వాలని ఐదేళ్లు కాళ్లరిగేలా జిల్లా అధికారుల చుట్టూ తిరిగారు. అయినా కళాశాల వైపు ఏ అధికారి చూడలేదు. దీంతో ఆర్డీటీ వంటి స్వచ్ఛంద సంస్థలు, సేవాగుణం కలిగిన వారిని ఆశ్రయించారు. అయితే అప్పటి పాలకులు వారిని సైతం ఆ కళాశాలవైపు రాకుండా నియంత్రించారని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు



గోడలుకట్టి వదిలేసిన గదులు



అసంపూర్తిగా నిలిచిపోయిన నిర్మాణాలు. పిల్లర్లు, స్లాబులతో వదిలేసిన భవనాలు



గదుల పరిస్థితి ఇదీ..!



తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం: హాస్టల్ విద్యార్థి

హాస్టల్లో తగిన గదుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కళాశాల హాస్టల్ అయితే బాగుంటుందని, సెక్యూరిటీ ఉంటుందని చాలా మంది ఇక్కడికే వస్తున్నాం. ఒకే గదిలో 20మంది వరకు ఉంటున్నాం. అదనపు భవనాలున్నా వాటిని పూర్తిగా నిర్మించలేదు. కొన్ని గదులకు గోడలు నిర్మించారు. మరికొన్నింటిని అలానే వదిలేశారు. బట్టలు ఆరవేయడానికి, చదువుకోవడానికి వాటినే ఉపయోగిస్తున్నారు. వర్షం వస్తే మెస్‌హాల్లో భోజనం చేయడానికి లేదు. ప్రైవేట్ హాస్టల్లో సెక్యూరిటీ ఇబ్బంది ఉంటుందని ఇక్కడే ఉండిపోతున్నాం.

దాతల కోసం ఎదురుచూస్తున్నాం : సత్యలత, ప్రిన్సిపాల్, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కళాశాలలోనే హాస్టల్‌ను ఏర్పాటు చేశాం. అయితే సరిపడా భవనాలు, గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో గదిలోనే 20మంది వరకు ఉంటున్నారు. వ్యక్తిగత అవసరాలు కూడా తీర్చుకోలేకపోతున్నారు. అదనంగా నిర్మాణం తలపెట్టిన భవనం పూర్తికాలేదు. పిల్లర్లు, స్లాబుల వరకే పనులు అయ్యాయి. కొన్ని గదులకు గోడలు కట్టివదిలేశారు. మిగిలిన పనులు పూర్తిచేయడం కోసం ఆర్డీటీ, ఇతర దాతలను సాయం అడిగాం. కళాశాల పూర్వ విద్యార్థుల నిధుల నుంచి దాదాపు రూ.4లక్షల విలువగల పనులు చేయిస్తున్నాం. దాతలు ముందుకువచ్చి సాయం చేస్తే విద్యార్థుల భవిష్యత్తుకు చేయూతనిచ్చిన వారవుతారు.



ఏంటో ఈ విడ్డూరం..!

మూతపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు కొనుగోలు బాధ్యతలు



మూతపడిన ఆయిల్ ఫెడ్ జిల్లా కార్యాలయం

- మద్దతు ధరలేక నష్టపోతున్న వేరుశనగ రైతులు
- సమాచారం తెలిపినా స్పందించని రాష్ట్ర అధికారులు

అనంతపురం అర్బన్/ శింగనమల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల అనాలోచిత నిర్ణయాలతో జిల్లా వేరుశనగ రైతులు నష్టపోతున్నారు. పండించిన వేరుశనగ పంటను మద్దతు ధరతో కొనేవారు కరువయ్యారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఏటా మద్దతు ధరతో రైతుల నుంచి వేరుశనగ కొనుగోలు బాధ్యతను ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థకు ఉన్నతాధికారులు అప్పగించేవారు. అయితే ఈ ఏడాది ఆయిల్‌ఫెడ్ సంస్థకు అప్పగించడం రైతులకు ఆశనిపాతమైంది. ఎందుకంటే ఈ సంస్థ జిల్లా కార్యకలాపాలు మానేసి మూడేళ్లు దాటింది. అయినా రాష్ట్ర ఉన్నతాధికారులు అనాలోచితంగా మూతపడిన సంస్థకు కొనుగోలు బాధ్యతలు అప్పగించడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆయిల్‌ఫెడ్ సంస్థ జిల్లాలో మూతపడిన విషయం రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలిపినా ఇప్పటి దాకా స్పందించలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో జిల్లా రైతులు నష్టపోవాల్సి వస్తోంది. తప్పని పరిస్థితుల్లో బయట మార్కెట్‌లో తక్కువ ధరకు వేరుశనగ పంటను అమ్ముకోవాల్సిన దుస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు.

అరకొర దిగుబడికి మద్దతు ధర ఏదీ?

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 7.9 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఇందులో 1.11 లక్షల ఎకరాల్లో వేరుశనగ పంట సాగైంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జూలై మాసంలో ఆలస్యంగా వేరుశనగ పంట సాగు చేశారు. వేరుశనగ పంట కీలక సమయాలు పూత, ఊడలు దిగే సమయాల్లో వర్షం పడలేదు. దీంతో వేరుశనగ దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు ఒక క్వింటా నుంచి 2 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. అక్టోబరు నెలాఖరులోగా 70 శాతం పంట కోత పూర్తయ్యింది. ఈనెల రెండో వారంలోగా మిగతా పంట కోతలు పూర్తి చేశారు. ఈ సారి అరకొరగా పండిన వేరుశనగ పంటను కూడా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయలేకపోతోంది. ప్రతి ఏడాది ఏపీ మార్క్‌ఫెడ్‌కు వేరుశనగ పంట ఉత్పత్తి కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తూ వస్తున్నారు. ఈ సారి ఆయిల్‌ఫెడ్ సంస్థకు అప్పగించారు. గత వైసీపీ సర్కార్ సమయంలోనే జిల్లాలో ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని బంద్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఆ సంస్థ అధికారులు, సిబ్బంది ఉద్యోగ విరమణ చెందారు. అప్పటి నుంచి జిల్లాకు ఎవరినీ నియమించలేదు. ఆయిల్ ఫెడ్ కార్యాలయాన్ని సైతం ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చేశారు. జిల్లాలో ఆయిల్ ఫెడ్ కార్యకలాపాలు లేకపోయినా వ్యవసాయ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు అనాలోచితంగా అదె సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించడం విమర్శలకు తావిస్తోంది. ప్రతి ఏడాది వేరుశనగ కోతలు పూర్తి కాగానే రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ఆరంభిస్తూ వస్తున్నారు. గతేడాది ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు మాసంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు పెట్టారు. అక్టోబరు నెలలో రైతుల నుంచి వేరుశనగను మద్దతు ధరతో కొనుగోలు చేశారు. ఈ సారి ఆయిల్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ బాధ్యతలు అప్పగించడంతో పాటు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులు ఏమిచేయలేని పరిస్థితిలో ఉండిపోయారు. వేరుశనగ పంటను మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఉమ్మడి జిల్లాలోని పలువురు రైతులు ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థ అధికారులను సంప్రదించినట్లు సమాచారం. ఈ విషయాన్ని వారు రాష్ట్ర ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు సమాచారం. అయినప్పటికీ ఇప్పటి దాకా ఆయిల్‌ఫెడ్‌కు బదులుగా తిరిగి ఏపీ మార్క్‌ఫెడ్‌కు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించలేదు.

మద్దతు ధర పెంచినా ప్రయోజనం శూన్యం

గతంతో పోలిస్తే ఈ సారి వేరుశనగ మద్దతు ధరను పెంచారు. ఈ ఏడాది వేరుశనగ క్వింటా కనీస మద్దతు ధర రూ.6783లుగా ప్రభుత్వం నిర్ణయించింది. గతేడాది వేరుశనగ మద్దత ధర రూ.6377 ఉంది. గతంతో పోలిస్తే ఈ సారి మద్దతు ధరను పెంచారు. అయినప్పటికీ జిల్లాలో మూడపడిన ఆయిల్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించడంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రభుత్వం స్పందించి ఎప్పటిలాగానే ఏపీ మార్క్‌ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు అప్పగించి, మద్దతు ధరను కల్పించాల్సి ఉంది.

తక్కువ రేటుకే అమ్ముకున్నా



ఈ సారి 9 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశా. దిగుబడి తక్కువగా వచ్చింది. వారం రోజుల కిందట బస్తా (42 కిలోలు)వేరుశనగ రూ.2300తోను అమ్మేశా. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసి ఉంటే మాకు ఈ పరిస్థితి వచ్చేది కాదు. అరకొరగా పండిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో మరింత నష్టపోయాం.

\- పరశురాం, సోదనపల్లి, శింగనమల మండలం

ఎదురుచూశా..



ఆరు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. 12 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. వేరుశనగ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారని ఎదురుచూశా. కనీసం వేరుశనగను కొనుగోలు చేస్తామని అధికారులు ప్రకటన కూడా ఇవ్వలేదు. దీంతో వారం రోజుల కిందట తక్కువ ధరకే వేరుశనగ అమ్మేశా.

\- శ్రీనివాసులు, చిన్నమట్ల గొంది, శింగనమల మండలం

మూతబడిన సంస్థకా బాధ్యతలు..?

జిల్లాలో మూతబడిన ఆయిల్ ఫెడ్ సంస్థకు వేరుశనగ కొనుగోలు బాధ్యతలు ఎలా అప్పగిస్తారు..? రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆ మాత్రం కనీస సమాచారం తెలియకపోతే ఎలా. ఉన్నతాధికారులు తీసుకున్న నిర్ణయాలతో జిల్లాలో కనీస మద్దతు ధరకు రైతులు దూరమయ్యారు. జిల్లాలో కొన్నేళ్లుగా ఆయిల్ ఫెడ్ సంస్థ కార్యకలాపాలు చేయడం లేదని తెలిసిన తర్వాత కూడా ఉన్నతాధికారులు స్పందించకపోవడం దారుణం. ప్రభుత్వం ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకొని, మద్దతు ధరతో వేరుశనగ పంటను కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

\- చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

నేడు, రేపు కేంద్ర బృందం పర్యటన

డ్వామా పీడీ సలీం బాషా



మాట్లాడుతున్న డ్వామా పీడీ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర జలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్లు జిల్లాలో రెండు రోజులు పర్యటించనున్నారు. కేంద్ర వాణిజ్యశాఖ డైరెక్టర్, కేంద్రజలశక్తి అభియాన్ నోడల్ ఆఫీసర్ అరులానందన్, శాస్త్రవేత్త షరీఫ్‌ఖాన్‌లు జిల్లాలో ఉపాధి, వాటర్‌షెడ్‌లలో చేపడుతున్న పనులను గురు, శుక్రవారం పరిశీలించనున్నారు. కేంద్ర బృందం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై తన చాంబర్‌లో డ్వామా పీడీ సలీంబాషా ఏపీడీలు, ఏపీఓలతో సమీక్షించారు. ఉపాధి హామీ, వాటర్‌షెడ్ పథకాల అమలు తీరు, చేపట్టిన పనులను కేంద్రబృందం పరిశీలిస్తుందని పీడీ తెలిపారు. వాన నీటి సంరక్షణ, భూగర్భజలాల పెంపు, మొక్కల పెంపకం, అటవీకరణ, వర్షం నీటి పునర్వినియోగం వంటి పనులను ప్రధానంగా పరిశీలిస్తారన్నారు. రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ప్రాంతాల్లో పర్యటిస్తారన్నారు. డ్వామా, అటవీశాఖ, హార్టికల్చర్, ఏపీఎంఐపీ, అగ్రికల్చర్, భూగర్భజల శాఖ, ఇరిగేషన్ శాఖల అధికారులు, ఇంజనీర్లు కేంద్రబృందానికి చేపట్టిన పనులను వివరిస్తారన్నారు. ఇప్పటి వరకు చేపట్టిన ఉపాధి, వాటర్‌షెడ్ పనులను, భవిష్యత్తులో జిల్లాలో చేపట్టే పనులపై చర్చిస్తారని తెలిపారు. సమావేశంలో వాటర్‌షెడ్ అడిషినల్ పీడీ సుధాకర్‌రెడ్డి, ఏపీడీలు విజయ్‌కుమార్, అయేషా, అనురాధా, శైలజ, ఏపీఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉడేగోళాన్ని ఆదర్శంగా తీసుకోండి

ప్రజలకు కేంద్ర బృందం సూచన

కణేకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని 43 ఉడేగోళం గ్రామాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని అభివృద్ధి చెందాలని కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ కురుసి రిస్తా, కేకే జాలి పేర్కొన్నారు. గ్రామంలో బుధవారం వారు పర్యటించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి ఏర్పాటు చేసిన తాగునీటి కొళాయి, మరుగుదొడ్లను పరిశీలించా రు. ఈ సందర్భంగా కేంద్ర బృందం సభ్యులు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా 43 ఉడేగోళంలో ప్రతి ఇంటికి తాగునీటి కొళాయి ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఏర్పాటు చేయడాన్ని ప్రశంసిం చారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ లావణ్యను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ శ్రీనివాసు లు, జేఈ శివకృష్ణారెడ్డి, సర్పంచ్ లావణ్య, వైస్ సర్పంచ్ రామాంజ నేయులు, టీడీపీ నాయకులు మారుతి, అనిల్, శివశంకర్ పాల్గొన్నారు.



ఉడేగోళంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం

రైతన్నకు యాప్ అండ

ఎన్‌పీఎస్ఎస్ యాప్ ద్వారా తెగుళ్ల వివరాలు, నివారణ చర్యలు

అనంతపురం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నేషనల్ పెస్ట్ సర్వేలెన్స్ సిస్టమ్ (ఎన్‌పీఎస్ఎస్) యాప్ ద్వారా పురుగు, తెగుళ్ల వివరాలు, వాటి నివారణ చర్యలు తెలుసుకోవచ్చునని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. స్థానిక రైతు శిక్షణా కేంద్రంలో బుధవారం ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులు, రైతులకు ఎన్‌పీఎస్ఎస్, జాతీయ పురుగు నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యాప్‌ను ఉపయోగించి పొలంలో పంటను ఫొటో తీస్తే ఆ పంటకు సోకిన తెగుళ్ల, పాటించాల్సి నివారణ చర్యల వివరాలను అందజేస్తుందన్నారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని ఎలా వినియోగించాలన్న విషయాలపై సీఐపీఎంసీ విజయవాడ కార్యాలయ ఆఫీస్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి వీరయ్య చౌదరి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో డీడీఏ మద్దిలేటి, టెక్నికల్ ఏఓ వెంకట్‌కుమార్ పాల్గొన్నారు.

బడి బాగుండాలని..!

ధర్మవరం మండలం చిగిచెర్ల జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణను విద్యార్థులు శ్రమదానంతో శుభ్రం చేస్తున్నారు. బాలురు పారలు చేతబట్టి పిచ్చి మొక్కలను తొలగిస్తున్నారు. బాలికలు పరకలతో చెత్తను ఊడ్చేస్తున్నారు. ఆటలకు అనువుగా గ్రౌండ్‌ను తీర్చి దిద్దుతున్నారు. పాఠశాల వాతావరణం ఆహ్లాదకరంగా ఉండేలా చూస్తున్నామని, శ్రమదానంలో విద్యార్థులు ఆసక్తిగా పాల్గొంటున్నారని హెచ్ఎం తిమ్మారెడ్డి అన్నారు.

\- ఆంధ్రజ్యోతి, ధర్మవరం రూరల్



పారలు, పరకలు పట్టి పనులు చేస్తున్న విద్యార్థులు

పేపర్‌బ్యాలెట్ వ్యాజ్యం కొట్టివేత

- సుప్రీం తీర్పును వెల్లడించిన కలెక్టరు

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్నికలలో ఈవీఎంలను తొలగించి పేపర్ బ్యాలెట్ విధానాన్ని మళ్లీ ప్రవేశ పెట్టాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం కొట్టివేసినట్లు కలెక్టరు డాక్టరు వినోద్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన కోర్టు ఉత్తర్వుల సారాంశాన్ని కలెక్టరు బుధవారం ఓప్రకటనలో వెల్లడించారు. ఎన్నికలలో ఈవీఎంల ట్యాంపరింగ్‌పై కేఏపాల్ చేసిన వాదనలను న్యాయస్థానం కొట్టేసిందన్నారు. అదే సమయంలో ఎన్నికలలో ఓడిపోయినపుడు మాత్రమే ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నించే నాయకుల అస్థిర వైఖరిని న్యాయస్థానం ఎత్తిచూపిందన్నారు. ఎన్నికలలో ఈవీఎంల వ్యవస్థతో రాజకీయపార్టీలకు ఎలాంటి సంబంధం లేదని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పీబీ.వరాలేలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసిందని కలెక్టరు తెలిపారు.

క్రైం కార్నర్

భార్య గొంతుకోసి చంపిన భర్త



ఈశ్వరమ్మ (ఫైల్)

లేపాక్షి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనుమానం పెనుభూతమై కట్టుకున్న భార్యను భర్త గొంతు కోసి, దారుణంగా హత్య చేశాడు. మండలంలోని కొండూరు గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత గాఢ నిద్రలో ఉన్న ఈశ్వరమ్మ (35)ను ఆమె భర్త దళిత శంకర్ హత్య చేశాడు. తరువాత పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లేపాక్షికి చెందిన దళిత నారాయణప్ప కుమారుడు దళిత శంకర్‌కు కొండూరు గ్రామానికి చెందిన దళిత తిప్పన్న కుమార్తె ఈశ్వరమ్మతో 14ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. శంకర్ టైలర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొన్నేళ్లుగా భార్యపై అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ వారి మధ్య గొడవలు జరిగేవని స్థానికులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈశ్వరమ్మ అలిగి, పుట్టింటికి వెళ్లింది. శంకర్ మంగళవారం అత్తగారింటికి వెళ్లాడు. భార్యను బాగా చూసుకుంటాననీ, గొడవ పడనని చెప్పాడు. ఈశ్వరమ్మ కూడా సరే అంది. రాత్రి భోజనం చేసి భార్యాభర్తలు ఒకే గదిలో నిద్రించారు. మరో గదిలో అత్తమామలు పడుకున్నారు. గాఢ నిద్రలో ఉన్న ఈశ్వరమ్మను శంకర్ కత్తితో గొంతు కోసి, దారుణంగా హత్యచేశాడు. తరువాత లేపాక్షి స్టేషన్‌కు చేరుకున్నాడు. తన భార్యను చంపానని పోలీసుల ఎదుట లొంగిపోయాడు. వెంటనే పోలీసులు కొండూరుకు చేరుకున్నారు. అప్పుడు ఈశ్వర మ్మ తల్లిదండ్రులు మేల్కొన్నారు. ఈశ్వర మ్మ మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి, హిందూపురం ఆస్పత్రికి తరలించారు. హత్యపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. కూలీ మృతి



కృష్ణమూర్తి (ఫైల్)

పెద్దపప్పూరు/నార్పల, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నార్పల మండలంలోని నాయనపల్లి ప్రధాన రహదారిపై బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియన వాహనం ఢీకొనడంతో కొత్తపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ కృష్ణమూర్తి (55) దుర్మరణం చెందాడు. కూలి పనిలో భాగంగా మొక్కజొన్న విత్తనాలు నాటేందుకు కొత్తపల్లి నుంచి వెంకటాంపల్లికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. మార్గమధ్యంలో ప్రమాదం జరగడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లక్ష్మీదేవి అనారోగ్యం కారణంగా గతంలోనే మృతి చెందింది. మృతుడికి ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమార్తెలిద్దరికీ వివాహాలు అయ్యాయి. మృతుడి కుమారుడు హరిప్రసాద్ ఫిర్యాదు మేరకు నార్పలఎస్‌ఐ సాగర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అంతర్‌జిల్లా దొంగల ముఠా అరెస్టు

84 గ్రాములు బంగారం, 2.173 కేజీల వెండి, రూ.లక్ష స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు మరిగి, సులువుగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలముఠాను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 7.68 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలు, లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో కేసు ఛేదింపు వివరాలను ఎస్పీ రత్న వెల్లడించారు. అనంతపురం నగరానికి చెందిన షికారి కోటయ్య, షికారి షాలి అలియాస్ శ్యామ్, షికారి శీనా అలియాస్ అర్జున్ వ్యసనాలకు బానిసలయ్యారు. వాటిని తీర్చుకునేందుకు సులువుగా డబ్బు సంపాదించాలనుకున్నారు. అందుకు చోరీలను ఎంచుకున్నారు. పుట్టపర్తి, గోరంట్ల, కదిరి తదిరత మండలాల్లో చోరీలు చేశారు. వీటిపై బాధితుల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు. చోరీలను జిల్లా పోలీసు అధికారులు సీరియస్‌గా పరిగణించారు. వాటిని ఛేదించేందుకు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, రూరల్ సీఐ సురేష్, ఎస్‌ఐ లింగన్న, సీసీఎస్ సీఐ శివాంజనేయులు, ఎస్‌ఐ రామచంద్రతో ప్రత్యేకబృందం ఏర్పాటు చేశారు. కేసుల దర్యాప్తులో భాగంగా నిందితులు ముగ్గురిని బుధవారం అరస్టు చేశారు. వారి నుంచి నగలు, నగదు, చోరీలకు వాడిన మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వివరించారు.

రివార్డులు: అంతర్ జిల్లా చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్, ఎస్బీ సీఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, ఎస్‌ఐ లింగన్న, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాంపు కష్టాలకు చెక్..!



ధర్మవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- కూటమి సర్కారు నూతన విధానం
- ఆధార్ తప్పనిసరి చేస్తూ నిర్ణయం
- కృత్రిమ కొరత, నకిలీలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యం

ధర్మవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భూములు, ఆస్తుల క్రయవిక్రయాలకు వెళ్తే స్టాంపులు దొరక్క తిప్పలు పడాల్సి వస్తోంది. సరఫరా అయిన స్టాంపుల్లో కొందరు పెద్దమొత్తంలో కొనుగోలు చేసి, కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికి చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దస్తావేజుల రిజిస్ట్రేషన్‌కు వాడే నాన్ జుడీషియల్ స్టాంపు అమ్మకాల తీరును సంస్కరించేందుకు నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. స్టాంపుల విక్రయాల్లో అక్రమాలను అరికట్టడానికి కొత్త నిబంధనలు తెచ్చింది. గత వైసీపీ ప్రభుత్వం ఈ-స్టాంపింగ్‌ను ప్రవేశపెట్టి, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకుంది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం నాన్ జుడీషియల్ స్టాంపుల వైపే మొగ్గుచూపింది. ఇందుకు అనుగుణంగా నాసిక్ నుంచి పెద్దసంఖ్యలో స్టాంపులను తెప్పించి, అన్ని జిల్లాలకు సరఫరా చేసింది. నాన్ జుడీషియల్ స్టాంపులు కావాలంటే గతంలో ఒక ఫారంలో పేరు, డినామినేషన్, చిరునామా తదితర వివరాలు నమోదు చేసి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉండేది. ఆ తరువాత స్టాంపులు ఇచ్చేవారు. ప్రత్యేక స్టాంపువెండర్ల ద్వారా కూడా వీటిని అమ్ముతుంటారు. కొందరు వెండర్లు ఎక్కువ సంఖ్యలో స్టాంపులు కొనుగోలు చేసి, అధిక ధరలకు విక్రయించే వారన్న విమర్శలున్నాయి. స్టాంపు కాగితాలపై పాత తేదీలను వేసి ఇవ్వడంతో న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యేవి. నకిలీస్టాంపులు కూడా వెలుగులోకి వచ్చాయి. ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు నూతన విధానాన్ని ప్రవేశపెట్టింది.

లెక్క తెలిసిపోతుంది..

స్టాంపుల విక్రయాల్లో గతంలో మాదిరిగా చికార్డుల్లో రాసి స్టాంపులు ఇచ్చే విధానానికి ప్రభుత్వం స్వస్తి పలికింది. రిజిస్టర్లు, అకౌంట్ పుస్తకాలు కలిగి ఉండే స్టాంపు వెండర్లు కూడా ఇప్పుడు తప్పనిసరిగా కంప్యూటర్, ప్రింటర్ కొనుగోలు చేయాల్సిందే. నూతన విధానంలో వెండర్ల వద్ద సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్లలో ఏయే స్టాంపులు, ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని అధికారులు తెలుసుకునే అవకాశం కల్పించారు. ఈ క్రమంలో విక్రయాలు తక్కువగా సాగే కార్యాలయాలనుంచి ఎక్కువ అవసరమైన వాటికి తెప్పించుకునే వెసులుబాటు ఉంటుంది. తద్వారా స్టాంపుల కృత్రిమ కొరతకు చెక్ పడుతుంది. కూటమి ప్రభుత్వ ఆలోచనపై హర్షం వ్యక్తమవుతోంది. స్టాంపు తీసుకోవాలంటే ఆధార్ తప్పనిసరి చేయడంతో పెద్ద మొత్తంలో కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోతుంది.

ఆధార్ తప్పని సరి..

ఒకటికన్నా ఎక్కువగా నాన్ జుడీషియల్ స్టాంపులు కొనుగోలు చేసినా కొత్త విధానంలో మొత్తం వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంది. స్టాంపులు పొందడానికి ఆధార్‌ను ప్రభు త్వం తప్పనిసరి చేసింది. ఆధార్ నంబరును కంప్యూటర్‌లో నమోదు చేయాలి. ఆ తరువాత కొనుగోలుదారుడి మొబైల్ నంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ కౌంటర్‌లో చూపిస్తే స్టాంపులు ఇస్తారు. ఒక వ్యక్తి ఐదు నుంచి 10 స్టాంపుల వరకూ కొనుగోలు చేసుకోవచ్చు. ఆధార్ నంబరు నమోదు చేయడం వల్ల ఎవరు, ఎన్ని స్టాంపులు కొనుగోలు చేశారో తెలుస్తుంది.

అందుబాటులో స్టాంపులు



నాన్ జుడీషియల్ స్టాంపులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్నాయి. కంప్యూటర్‌లో ఆధార్ నంబరు నమోదు చేసుకుని, స్టాంపులు విక్రయించాలి. నగదు ఆన్‌లైన్‌లో చెల్లించే అవకాశం ఉంది. స్టాంపు వెండర్లు నిబంధనలు తప్పక పాటించాలి.

- తాయన్న, సబ్‌రిజిస్ట్రార్, ధర్మవరం

వెదురుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- తొలిసారిగా రాయితీ వర్తింపు
- ఐదు ఎకరాల దాకా రూ.50 వేలు



గుమ్మఘట్ట మండలం గొల్లపల్లిలో వెదురు పంటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

అనంతపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెదురు సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వెదురు సాగుకు రాయితీని వర్తింపజేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పొలాల్లో వెదురును పూర్తి పంటగా సాగు చేసుకోవచ్చు. గట్ల వెంబడి నాటుకుంటే ప్రధాన పంటతోపాటు అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. ఒక్కో రైతుకు ఐదు ఎకరాల దాకా వెదురు సాగుకు రాయితీని కల్పించారు. గరిష్టంగా రూ.50వేలు దాకా రాయితీని వర్తింపజేస్తారు. మొదటి సంవత్సరం రూ.25వేలు, రెండో సంవత్సరం రూ.15వేలు, మూడో సంవత్సరం రూ.10వేలు చొప్పున బతికి ఉన్న మొక్కల సంఖ్య ఆధారంగా అందజేయాలని నిర్ణయించారు. రెండో సంవత్సరం రాయితీ అందించాలంటే 80 శాతం మొక్కలు బతికి ఉండాలి. మూడో సంవత్సరం రాయితీ ఇవ్వాలంటే 100 శాతం మొక్కలు బతికి ఉండాలన్న షరతు విధించారు. గుంతలు తవ్వడానికి, మొక్కలు ఖరీదు, ఎరువులు, నీటి పాదరులకు కలిసి ఐదు ఎకరాలకు రూ.50వేలు రాయితీ వర్తింపజేస్తారు. పొలం మొత్తం వెదురు నాటుకోవాలంటే ఒక మొక్కకు మరో మొక్కకు వరుసకు, వరుసకు మధ్య 5 మీటర్ల దూరాన్ని పాటించాలి. ఇలా ఎకరాకు 160 మొక్కలు దాకా నాటుకోవచ్చు. గట్ల వెంబడి నాటుకోవాలంటే ఒక మొక్కకు మరో మొక్కకు 2 మీటర్ల దూరం ఉంటే సరిపోతుంది. జిల్లాలో ఎంత విస్తీర్ణానికైనా వెదురు సాగుకు సబ్సిడీ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని గుమ్మఘట్ట మండల గొల్లపల్లిలో 7.5 ఎకరాల్లో పూర్తిగా వెదురు సాగవుతోంది. అలాగే గుంతకల్లు మండలం నక్కనదొడ్డిలో 7.5 ఎకరాల తోట చుట్టూ వెదురు సాగు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వెదురు సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీని వర్తింపజేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉపయోగాలు....

వెదురుతో పలు రకాల పనిముట్లు తయారు చేస్తారు. ముఖ్యంగా ఫర్నిచర్, జ్యువెలరీ అగర్బత్తి, తడికలు, నిచ్చెనలు, తయారు చేస్తారు. గృహ నిర్మాణం, కాగితం, దుస్తులు, ఔషధాలు, కళాత్మక వస్తువులు ఇలా అనేకం తయారు చేస్తారు. బ్యాంబూ షూట్స్‌ను ఆహారంగా తీసుకుంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో వెదురు సాగుకు రాయితీకి వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పొలంలో పూర్తి పంటగా (బ్లాక్ ప్లాంటేషన్) లేదా బౌండరీ ప్లాంటేషన్ పద్ధతిలోనూ వెదురు పంటను సాగు చేసుకోవచ్చు. జిల్లా రైతులు ఎల్లప్పుడూ కొత్త రకం పంటలను సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. మన వాతావరణ పరిస్థితులకు వెదురు సాగు అనుకూలం. రైతులెవరైనా వెదురు నర్సరీ ఏర్పాటు చేయాలనుకుంటే రూ.లక్ష దాకా రాయితీ కల్పిస్తాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం స్థానిక రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలి.

- నరసింహరావు, ఉద్యాన శాఖ జిల్లా అధికారి

కర్ణాటకలో విద్యార్థి ఆత్మహత్య



తేజ (ఫైల్)

డీ.హీరేహాళ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని విజయనగరం జిల్లా కారిగనూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి డీ.హీరేహాళ్‌కి చెందిన విద్యార్థి తేజ(17) ఆత్మహత్య చేసుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన రవి, భాగ్యమ్మ దంపతులు కూలిపని చేసుకుని జీవనం సాగిస్తూ ఉండేవారు. వీరికి ఇద్దరు కుమారులు. తేజ బళ్లారి వీరశైవ కాలేజీలో ఇంటర్ సెకెండియర్ చదువుతుండేవాడు. హుబ్లిలో పని ఉందని రెండు రోజుల కిందట ఇంటి నుంచి బయల్దేరి వెళ్లాడు. అయితే మంగళవారం రాత్రి కర్ణాటకలోని కరిగనూరు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు తేజ వద్ద లభించిన ఆధారాలతో రైల్వేపోలీసులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీనిపై కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని విమ్స్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఉద్యోగం చేయలేక బలవన్మరణం



సాయిప్రసాద్ (ఫైల్)

లేపాక్షి నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సోమందేపల్లి సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్న సాయిప్రసాద్(24) తన ఇంట్లో ఫ్యాన్‌కు బుధవారం ఉరివేసుకున్నాడు. లేపాక్షికి చెందిన సాయిప్రసాద్ కార్ల తయారీ అనుబంధ సంస్థలో ఉద్యోగి. పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, మానేస్తానని తల్లిదండ్రులకు చెప్పేవాడు. మధ్యతరగతి జీవితం అని, సర్దుకుపోవాలని వారు సూచించారు. దీంతో దిక్కుతోచక ఉరి వేసుకున్నాడు. సాయి ప్రసాద్‌కు ఎనిమిది నెలల క్రితమే వివాహమైంది. ఇంతలోనే భర్త దూరం కావడంతో ఆమె కన్నీరుమున్నీరయ్యారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని ఎస్‌ఐ నరేంద్ర తెలిపారు.

ఎందుకొచ్చిన ఉద్యోగం..?

- విధులను పట్టించుకోని వార్డెన్
- కూడేరు ఎస్సీ హాస్టల్ విద్యార్థి అదృశ్యం
- మరుసటి రోజు ఆచూకీ లభ్యం
- శాఖాధికారులతో తండ్రి గొడవ..?
- ఆలస్యంగా వెలుగులోకి సంఘటన



కూడేరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహంలో ఉంటున్న ఎనిమిదో తరగతి విద్యార్థి అహరూన్ గత వారం అదృశ్యమయ్యాడు. హాస్టల్ నుంచి పాఠశాలకు వెళ్లిన బాలుడు సాయంత్రం తిరిగి రాలేదు. ఈ విషయాన్ని హాస్టల్లోని విద్యార్థులు చెప్పేంత వరకూ కూడా వార్డెన్ పట్టించు కోలేదు. సాయంత్రం హాస్టల్‌లో విద్యార్థులు బయోమెట్రిక్ వేసే సమయంలో కూడా విద్యార్థి మిస్సింగ్ అయినట్లు గుర్తించలేదు. ఆ తరువాత కూడా విద్యార్థి కోసం గాలింపు చర్యలు చేపట్టకుండా సంబంధిత శాఖాధికారులు, తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం అందించి మిన్నకుండిపోయాడు. అయితే పైఅధికారులు అప్రమత్తమై మరుసటి రోజు ఉదయం అనంతపురంలోని రైల్వేస్టేషన్‌లో ఆ విద్యార్థి ఉన్నట్లు గుర్తించి, పట్టుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. అయితే విద్యార్థి అహరూన్ తండ్రి జిల్లా కేంద్రంలోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయానికి వెళ్లి ఆ శాఖాధికారులతో గొడవకు దిగాడు. తమ కుమారుడి పర్యవేక్షణపై ఇంత నిర్లక్ష్యమా..? ఏదైనా జరిగి ఉంటే ఎవరు బాధ్యత వహిస్తారు..? రాత్రంతా మా కుమారుడు ఎన్ని ఇబ్బందులు పడుంటాడని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆ సమయంలో అధికారులు అతడికి సర్ది చెప్పి పంపించారు.

సెలవులో వెళ్లేందుకు వార్డెన్ యత్నం...

విద్యార్థి అదృశ్యం సమస్య నుంచి తప్పించుకునేందుకు కూడేరు హాస్టల్ వార్డెన్ సెలవులో వెళ్లేందుకు ప్రయత్నించినట్లు ఆ శాఖాధికారుల ద్వారా తెలిసింది. అయితే ఇన్‌చార్జ్ బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆ శాఖాధికారులు సెలవు మంజూరు చేయనట్లు సమాచారం. ఆ హాస్టల్ వార్డెన్ ముందు నుంచి విధుల పట్ల అలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. హాస్టల్ విద్యార్థి అదృశ్యం వెనుక కారణాలు లేకపోలేదు. తప్పిపోయిన విద్యార్థికి, సహచర విద్యార్థులకు హాస్టల్‌లో గొడవలు జరిగినట్లు సమాచారం. అయితే విద్యార్థుల కదలికలు గమనించి ఏవైనా సమస్యలుంటే స్పందించి సర్దిచెప్పాల్సిన వార్డెన్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నట్లు తెలుస్తోంది. అడ్మిషన్ల విషయంలోనూ ఆ వార్డెన్ అదే అలసత్వాన్ని వహిస్తున్నట్లు సమాచారం. హాస్టల్ కెపాసిటీ 100 మందికిపైగా ఉంది. కానీ 50 మందికి మించి ఉండటం లేదు. వార్డెన్ పట్టించుకోకపోవడం వల్లే అడ్మిషన్లు తక్కువగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. మరి ఆ శాఖలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీడీ ప్రతాప్ సూర్యనారాయణ రెడ్డి ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

అవయవదానంతో పునర్జన్మ

- ఐఎంఏ స్టేట్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ హేమలత



డాక్టర్ హేమలతను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం సెంట్రల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వ్యాధులతో బాధపడుతూ, అవయవాలు లభించక దేశంలో రోజుకు 20మంది మరణిస్తున్నారని ఐఎంఏ స్టేట్ జాయింట్ సెక్రెటరీ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ హేమలత ఆవేదన వ్యక్తంచేశారు. అవయదానంతో దాతలు పునర్జన్మ పొందవచ్చునని ఆమె తెలిపారు. భారత అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డైరెక్టర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సదస్సుకు ఆమె ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. రక్తదానం, నేత్రదానం, దేహదానం, అవయవదానం గురించి వివరించారు. దాతలుగా చేరాలనుకునే వారు https://jeevandan.ap.gov.in/ లేదా https://notto.abdm.gov.in/ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. మొబైల్ లోనే జీవన్ దాన్, నోటో వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చునని తెలిపారు. హోమ్ పేజీ ఓపెన్ కాగానే ప్రతిజ్ఞ(ప్లెడ్జ్) కనబడుతుందన్నారు. అంగీకరిస్తూ టిక్‌మార్క్ పెట్టిన వారు సభ్యులుగా నమోదు అవుతారన్నారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్, ఇతర వివరాలను భర్తీచేయడంతో డోనార్స్‌గా రిజిస్టర్ అవుతారని వివరించారు. అనంతరం డాక్టర్ హేమలతను సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపినాథ్, డీఆర్ దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓ లహరి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధిలు సీతామహాలక్ష్మి, అమర్నాథ్‌రెడ్డి, తిరుపాల్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్లు

ఎందుకు కట్టినట్లు..?

కూడేరు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో రూ.ఆరు లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను వాడకుండా వదిలేశారు. వివిధ పనులపై వచ్చే ప్రజలు, అక్కడ పని చేసే సిబ్బంది కోసం వీటిని నిర్మించారు. పనులన్నీ ఏడాది కిందటే పూర్తయ్యాయి. కానీ వీటిని వినియోగంలోకి తేలేదు. అధికారులు స్పందించి, లక్షలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లను వెంటనే వినియోగంలోకి తేవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

- కూడేరు

ప్రమాదకరం..

- జీఎస్‌బీసీపై పాక్షికంగా కూలిన వంతెన
- రాళ్లు అడ్డుపెట్టి వదిలేసిన ఆర్‌అండ్‌బీ శాఖ



కూలిన వంతెన వద్ద అడ్డుపెట్టిన రాళ్లు

గుంతకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో గుత్తి సబ్ బ్రాంచ్ కాలువ (జీఎస్‌బీసీ)పై ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ జీఎస్‌బీసీ గుంతకల్లు పట్టణం గుండా వెళ్తోంది. ఆలూరు రోడ్డులో ఈ కాలువపై గల ఆర్‌అండ్‌బీ రహదారిపై వంతెనను నిర్మించారు. ఈ వంతెన నిర్వహణ సరిగా లేకపోవడంతో నాలుగు నెలల కిందట పాక్షికంగా కూలిపోయింది. పక్షం రోజుల కిందట కురిసిన వర్షాలకు వంతెన రక్షణ గోడ మరింత దెబ్బతింది. అత్యవసరంగా మరమ్మతు చేయాల్సిన ఈ వంతెన వద్ద ప్రమాదాలు జరక్కుండా పోలీసులు రాళ్లను, రెండు బారికేడ్లను అడ్డుగా ఉంచారు. రాళ్లపై తెల్లటి సున్నం చల్లారు. చర్యలు తీసుకోవాల్సిన ఆర్‌అండ్‌బీ శాఖ మీనమేషాలు లెక్కిస్తోంది. ఇక్కడ చాలా లోతులో కాలువ ఉన్నందున వాహనాలు అదుపుతప్పితే పెను ప్రమాదం జరిగే పరిస్థితులున్నాయి.

వంద అడుగుల లోతైన డీప్ కట్



వంతెన కింద వంద అడుగుల డీప్ కట్

ఆలూరు రోడ్డులో సీబీటీయూ కాలనీ వద్ద జీఎస్‌బీసీపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. నాలుగు నెలల కిందట ఈ వంతెనపై లోడు లారీ నిలపగా, పాక్షికంగా వంతెన, దాని రక్షణ గోడ కుంగిపోయి కింద ఉన్న కాలవలోకి పడిపోయాయి. లారీ కూడా పక్కకు ఒరిగి, అంచును తాకి బాలెన్సులో నిలిచిపోయింది. వెంటనే ఎక్స్‌కవేటరుతో లారీని పక్కకు లాగి ప్రమాదం జరగకుండా జాగ్రత్తపడ్డారు. కాగా ఈ వంతెన కింద ఉన్న జీఎస్‌బీసీ దాదాపు వంద అడుగుల డీప్ కట్‌లో ఉంది. ఈ డీప్ కట్ పూర్తిగా బండరాళ్లమయంగా ఉండటంతో వాహనాలు అదుపుతప్పితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఆ నిధులతో సత్వరమే జీఎస్‌బీసీపై ఉన్న వంతెనకు మరమ్మతులు చేయించాల్సిన అవసరముంది.

విద్యార్థులకు దారి కష్టాలు

● గురుకుల జూనియర్ కళాశాల ప్రధాన దారి మూసివేత ● చుట్టూ కప్పేసిన ముళ్ల పొదలు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాల, ప్రధాన దారిని కప్పేసిన కంపచెట్లు, అపరిశుభ్రంగా కళాశాల ఆవరణం

అనంతపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ముళ్ల కంపలు ఏపుగా పెరిగిపోవడంతో రాకపోకలకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కురుగుంటలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాల ప్రధాన రోడ్డు మూతపడింది. దారికి ఇరువైపులా ముళ్లకంపలు ఏపుగా పెరిగిపోయాయి. స్థానికంగా ఉన్న కాలనీలోని మురుగు నీరు కళాశాల ప్రధాన గేటు వద్దకు చేరుతోంది. కళాశాల ఆవరణంలోని పరిసరాలు ఇంతే అధ్వానంగా కనిపిస్తున్నాయి. పిచ్చిమొక్కలు, ముళ్ల కంపలతో దర్శనమిస్తోంది.

ఉన్నదారిని మూసి.. మరోదారిలో రాకపోకలు

కళాశాల నిర్మాణంలో భాగంగా లక్షలు వెచ్చించి అన్ని హంగులతో ఆర్చ్ ఏర్పాటు చేసి ప్రధాన ద్వారం నిర్మాణం చేశారు. పెద్ద గేటు ఏర్పాటు చేశారు. పెద్ద అక్షరాలతో కళాశాల బోర్డును కూడా ఏర్పాటు చేశారు. బళ్లారి-అనంతపురం హైవే ప్రధాన రోడ్డు నుంచి స్థానికంగా ఉన్న ఎస్సీ కాలనీలో నుంచి నేరుగా కళాశాలలోకి వెళ్లేందుకు వీలుంది. ఏమైందో కానీ, కొన్నేళ్ల కిందట ఆ దారిని పూర్తిగా మూసివేశారు. దీంతో ఆ దారి గుండా రాకపోకలను పూర్తిగా నిలిచిపోయాయి. గతంలో కళాశాల ప్రధాన దారి నుంచి వైఎస్సార్ కాలనీలోకి దారి ఉండేదని తెలుస్తోంది. అప్పట్లో కాలనీ వాసులు నుంచి ఇబ్బందులు తలెత్తుండటంతో కళాశాల ప్రధాన దారి మూసివేసినట్లు తెలుస్తోంది. ఈ దారి మూసివేయడంతో ప్రస్తుతం కళాశాలలోకి వెళ్లాంటే కిలో మీటరుకు పైగా తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి వేళలో అటు వైపు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. చుట్టూ ముళ్ల కంపల చెట్లు పెరిగిపోయి పొదలు ఏర్పడ్డాయి. రాత్రివేళల్లో తాగుబోతులకు నిలయంగా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అధ్వానంగా పరిసరాలు..

కళాశాల పరిసరాలు అధ్వానంగా కనిపిస్తున్నాయి. కళాశాల ప్రహరీ చుట్టూ పిచ్చిమొక్కలు, ముళ్లకంపలు దర్శనమిస్తున్నాయి. ప్రహరీ బయట..లోపల ఇదే పరిస్థితి నెలకొంది. కళాశాల ఆవరణంలోను ఇదే విధంగా ఉంది. విషసర్పాలు సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. కళాశాల భవనంలోనూ ఫ్లోరింగ్ బండలు కుదించుకుపోయాయి. కళాశాలలో ఎలాంటి మరమ్మతులు చేయించుకోవాలన్నా నిధులు లేమితో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



కళాశాల ప్రధాన గేటు ఎందుకు మూసివేశారో తెలియదు. కొన్నేళ్లుగా మూసేశారని తెలిసింది. ఈ దారి అన్ని విధాలుగా అనుకూలంగా ఉంది. చిన్నపాటి పనులు చేయిస్తే అందుబాటులోకి తీసుకురావచ్చు. ఇటీవల కళాశాలలో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కళాశాలలో మెయింటెనెన్స్‌కు నిధులు లేకపోవడంతో కొంత వరకు ఇబ్బందులు పడుతున్నాం. **- నాగజ్యోతి, ప్రిన్సిపాల్**

ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయానికి కొత్త భవనం

● నిర్మాణానికి రూ.1.80 కోట్లతో ప్రణాళికలు ● ప్రభుత్వ అనుమతి రాగానే పనులు ప్రారంభం : ఎమ్మెల్యే

అనంతపురం కల్చరల్/అర్బన్/రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న అనంతపురం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ కార్యాలయానికి కొత్త భవనం నిర్మించేందుకు రూ.1.80 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేశారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఎమ్మెల్యేతోపాటు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ అనంతపురం ఆర్ఎం కార్యాలయంతోపాటు బస్టాండు భవనాన్ని సందర్శించారు. అనంతరం జోనల్ చైర్మన్ కార్యాలయంలో ఆర్టీసీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే, జోనల్ చైర్మన్ మాట్లాడారు. కార్యాలయ నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపుతామని, అనుమతులు రాగానే నూతన భవన నిర్మాణం చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటి సీటీఎం శ్రీలక్ష్మి, డిప్యూటీ సీఎంఈ రమేష్‌బాబు, పీఓ చెంద్రాయుడు, లా ఆఫీసర్ చంద్రశేఖర్, డీఎం నాగభూపాల్ పాల్గొన్నారు.



కూలిన భాగాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, పూల నాగరాజు, వెంకటశివుడు యాదవ్

పాఠశాలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

అనంతపురం కేఎస్ఆర్ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి ఆయన పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. పాఠశాలలో రికార్డులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతాన్ని ఆయన పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. చదువు బాగా చెబుతున్నారా..? మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉంటోందా..? తదితర విషయాలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు.

ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్ పరిధిలోని లబ్ధిదారులకు 10వేల ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ హౌసింగ్ అధికారులకు సూచించారు. తన క్యాంప్ కార్యాలయంలో హౌసింగ్ పీడీ శైలజ, డీఈ మధుసూదన్‌రెడ్డితో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. అర్బన్ నియోజకవర్గంలో ఎంత మంది లబ్ధిదారులు ఉన్నారు..? ఇప్పటి దాకా ఎన్ని ఇళ్లు పూర్తయ్యాయి..? ఏఏ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయన్న వివరాలపై ఆరా తీశారు.

సీసీ రోడ్లు ప్రారంభం

స్థానిక ఎ.నారాయణపురం పంచాయతీలో ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్ మీ ఇంటికి మీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపట్టారు. ముందుగా నారాయణపురం, స్టాలిన్ నగర్‌లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో రూ.50లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అక్కడి నుంచి చెక్‌డ్యాం వద్ద రూ.5కోట్లతో నిర్మిస్తున్న వంతెనను పరిశీలించారు. డంపింగ్ యార్డ్‌కు శాశ్వత పరిష్కారం చూపించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, స్పెషల్ ఆఫీసర్ సురేష్, కార్యదర్శి ప్రవీణ్‌బాబు, డీఈ లక్ష్మీనారాయణ, జేఈ శివారెడ్డి, టీడీపీ నాయకులు బుగ్గయ్యచౌదరి, రాయల్‌మురళీ, డిష్‌నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బంగారం దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో పలు బంగారం దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా పాతవూరు గాంధీ బజార్‌లోని స్టార్ జ్యూవెలర్స్, సయ్యద్ జ్యూవెలర్స్, కమలానగర్ లోని గొంది నాగయ్య శెట్టి జ్యూవెలర్స్‌లలో తనిఖీలు చేపట్టి ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, హాల్‌మార్క్ సర్టిఫికెట్, అమ్మకాలు, కొనుగోలు బిల్లులు, తూకాలకు సంబంధించిన యంత్రాలను తనిఖీ చేశారు. పలు లోపాలు ఉన్నట్లు గుర్తించామని డీఎస్పీ నాగభూషణం తెలిపారు. ప్రధానంగా కొలతల్లో తేడాల కారణంగా గొంది నాగయ్య శెట్టి జ్యూవెలర్స్ సయ్యద్ జ్యూవెలర్స్‌లోని తూకాలకు సంబంధించిన యంత్రాను సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల కోసం లీగల్ మెట్రాలజీ అధికారులకు అప్పగించామని తెలిపారు. సయ్యద్ జ్యూవెలర్స్‌లో హాల్‌మార్క్ సర్టిఫికెట్ చూపలేదన్నారు. దీంతో పాటు రికార్డులు పరిశీలించగా ఉన్న స్టాక్‌కు రికార్డులకు పొంతన లేని విధంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో మూడింటికి నోటీసులు జారీ చేశామని వివరించారు. మిగిలిన దుకాణాల్లో కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ఎక్కడ ఎలాంటి తేడాలున్నా చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. వినియోగదారులకు తూకాల్లో వ్యత్యాసాలు చూపి అమ్మిన, తగిన విధంగా బిల్లులు లేకుండా, అమ్మినా, కొన్నా.. అవకతవకలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తప్పవని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వైబీపీటీఏ ప్రసాద్ హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, లీగల్ మెట్రాలజీ అధికారి సుధాకర్, ఏఓ వాసుప్రకాష్, డీసీటీఓ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బంగారం దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నగరపాలికలో సీట్ల మార్పు

అనంతపురం క్రైం,నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరపాలికలో పలు సీట్లు మార్పు చేశారు. కీలకమైన రెవెన్యూ విభాగం ప్రక్షాళన చేశారు. దీని వెనుక కాసులు పనిచేసినట్లు సమాచారం. అదేవిధంగా ఆ సీట్లలో కూర్చోవాలనుకునేవారు కొందరు అధికారపార్టీ నేతలతో కార్పొరేషన్ ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తీసుకొచ్చినట్లు సమాచారం. సీటుకు ఇంత ఇని ఆమ్యామ్యాలు పుచ్చుకున్నట్లు తెలిసింది. వీరిలో అవినీతికి పాల్పడే ఆరోపణలున్న కొందరికి పోస్టింగులు ఇవ్వడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. ఎలాగూ సంపాదిస్తాం కదా ఇది అడ్వాన్సుగా ఇచ్చినట్లవుతుందనే భావనలో ఉన్నట్లు సమాచారం. ఓ కౌన్సిల్ సమావేశంలో ఆర్ఐగా ఉన్న చంద్రశేఖర్ అవినీతికి పాల్పడుతున్నాడంటూ ఓ కార్పొరేటర్ మాట్లాడారు. దీంతో ఆ ఆర్ఐపై వేటు పడింది. టౌన్‌ప్లానింగ్ విభాగానికి మార్చారు. మళ్లీ ఇప్పుడు చంద్రశేఖర్‌ను ఆర్ఐగా మార్చడం వెనుక ఆంతర్యం ఏంటో ఉన్నతాధికారులకే తెలియాలి. గతంలో ఇలాంటి సీట్ల కోసం రూ.లక్ష వరకు వ్యవహారం నడిచిన దాఖలాలున్నాయి. అటు ఉన్నతాధికారులుగా అడిషనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌లు పర్యవేక్షిస్తున్నారు. ఆ ఇద్దరు ఉన్నతాధికారులు ఇలాంటి ఉద్యోగులు, అధికారులతో రెవెన్యూ విభాగాన్ని ఎలా నడిపిస్తారో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా...ఆర్వో, ఆర్ఐ సీట్లు మార్చడంతో ఆ సీట్లలో ఇదివరకు ఉన్న వారిలో కొందరు అవే సీట్లలో కొనసాగాలని, ఎలా మారుస్తారంటూ తెగబాధపడిపోతున్నారట.

మార్పు ఇలా...

అకౌంట్స్ విభాగం సూపరింటెండెంట్ విజయ్‌కుమార్‌ను రెవెన్యూ ఆఫీసర్-1 (ఆర్వో-1)గా మార్పు చేశారు. రెవెన్యూ ఆఫీసర్-గా ఉన్న సుజాతను పబ్లిక్‌హెల్త్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. మేనేజర్ లక్ష్మీదేవిని ఆర్వో-2గా, ఆర్వో-2గా ఉన్న సతీష్‌కుమార్‌ను మేనేజర్‌గా మార్చారు. రెవెన్యూ విభాగం సూపరింటెండెంట్ దేవశంకర్‌ను అకౌంట్స్ విభాగం సూపరింటెండెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్(బీ2 క్లర్క్)అబ్దుల్ రజాక్‌ను ఆర్ఐగా, ఆర్ఐ మురళీమోహన్‌ను టౌన్‌ప్లానింగ్ జీ1 క్లర్క్‌గా, సీనియర్ అసిస్టెంట్(సీ2 క్లర్క్)ను ఆర్ఐగా, ఆర్ఐ రాజేంద్రప్రసాద్‌ను సీ2 క్లర్క్‌గా, జూనియర్ అసిస్టెంట్ రఘునాథరెడ్డి(ఏ3 క్లర్క్)ను ఆర్ఐగా, ఆర్ఐ వేణుగోపాల్‌ను బీ2 క్లర్క్‌గా, జూనియర్ అసిస్టెంట్(ఏ4 క్లర్క్)ను రెవెన్యూ విభాగంలో ఏ3 క్లర్క్‌గా బదిలీ చేశారు.

నేడు నేషనల్ అండర్-19 సెమీ ఫైనల్స్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బధిరుల నేషనల్ అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ టీ20 చాంపియన్‌షిప్ పోటీల్లో భాగంగా గురువారం సెమీఫైనల్స్ నిర్వహించనున్నారు. బుధవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రెండో రోజు బధిరుల నేషనల్ అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ టీ20 చాంపియన్‌షిప్ పోటీలు కొనసాగాయి. 9వ మ్యాచ్‌లో ఛత్తీస్‌ఘర్, మధ్యప్రదేశ్ జట్ల మధ్య జరగగా...నిర్ణీత 20ఓవర్లలో ఛత్తీస్‌ఘర్ 7వికెట్లు కోల్పోయి 135 పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ 17.4 ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. లక్కీరాథోర్ 65 పరుగులు చేశాడు. పదో లీగ్ మ్యాచ్‌లో ఒడిశా, హర్యాణా జట్లు తలపడగా... ఒడిశా 14.4ఓవర్లలో 66పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. బౌలర్లు సానిత్‌శెట్టి, ప్రసాద్‌బెహ్రా చెరో 3 వికెట్లు తీశారు. అనంతరం బరిలోకి దిగిన ఒడిశా 8.4 ఓవర్లలో 2వికెట్లను మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని చేధించింది. 11వ మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ బరిలోకి దిగగా ఒడిశా 20ఓవర్లలో 125పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం బరిలోకి దిగిన ఉత్తరప్రదేశ్ 14.5ఓవర్లలో 55పరుగులకే ఆలౌట్ అయ్యింది. 12వ మ్యాచ్‌లో మహారాష్ట్ర, హర్యాణాలు తలపడగా....హరియాణా 20ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 150పరుగులు చేసింది. పీయూష్ 50 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన హరియాణా 20ఓవర్లలో 8వికెట్లు కోల్పోయి 141పరుగులు చేసి ఓటమిపాలైంది. లీగ్‌లో మెరుగైన ప్రదర్శనతో సెమీస్‌కు చేరిన నాలుగు జట్లు తలపడనున్నాయి. మొదటి సెమీస్ హర్యాణా-ఆంధ్రప్రదేశ్, రెండో సెమీస్ ఒడిశా-మహారాష్ట్ర జట్ల మధ్య జరగనుంది. కార్యక్రమంలో బధిరులక్రికెట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు సుమిత్‌జైన్, ఆర్డీటీ మేనేజర్ శ్రీదేవి, జిల్లా మేనేజర్ దేవరాజ్, బధిరుల క్రికెట్ సంఘంరాష్ట్ర కార్యదర్శి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, గోపీనాథ్ పాల్గొన్నారు.



సెమీస్‌కు చేరిన హరియాణ జట్టు

సంక్షిప్తం

పూల నాగరాజుకు సన్మానం



పూల నాగరాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు

అనంతపురం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజును ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు సన్మానించారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో పూల నాగరాజుకు శాలువ కప్పి, పుష్పగుచ్చం అందజేసి ఎమ్మెల్యేలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పూల నాగరాజు సామాన్య కార్యకర్త స్థాయి నుంచి పార్టీ కోసం సేవలు అందించారని కొనియాడారు.

బాల్యవివాహాలను అరికడదాం: ఆర్డీఓ

అనంతపురం టౌన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అందరం సమష్టిగా పనిచేసి బాల్యవివాహాలను పూర్తిగా అరికడదామని అనంతపురం ఆర్డీఓ కేశవనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖమంత్రి బాల్య వివాహ ముక్తభారత్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని మినీకాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆర్డీఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల పిల్లల జీవితాలు నాశనమవుతాయని, ఆరోగ్యపరంగా కూడా అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, సీఈఓ వెంకటసుబ్బయ్య, రెడ్స్ భానుజా, పలువురు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దామాజుపల్లి సమీపంలో జాతీయ రహదారి జంక్షన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. నాయాల గ్రామానికి చెందిన అశ్వర్థనారాయణ అదే గ్రామానికి చెందిన ఓ మహిళతో కలిసి ద్విచక్రవాహనంలో పని నిమిత్తం చెన్నేకొత్తపల్లికి వెళ్తున్నారు. జంక్షన్ వద్దకు రాగానే లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో వారిద్దరికి గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం వారిని సీకే పల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సొసైటీ అధ్యక్ష పదవికి నామినేషన్

అనంతపురం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్ష పదవికి మేకల వేణుగోపాల్ గౌడ్ నామినేషన్ వేశారు. బుధవారం మండలంలోని స్టాలిన్ నగర్ నందుగల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఈడిగ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన నామినేషన్ వేశారు. కార్యక్రమంలో ఈడిగ గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, అనిల్‌కుమార్‌గౌడ్, వెంకటేస్‌గౌడ్, రామకృష్ణ, శ్రీకాంత్, గంగాధర్, శ్రీరాముడు, గోపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

అనంతపురం క్రైం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నగరం లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. బుధవారం నగరంలోని 13వ డివిజన్ పరిధిలో రూ.38లక్షలతో చేపడుతున్న ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మేయర్ మహమ్మద్ వసీం, కమిషనర్ నాగరా జు, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్‌రెడ్డి, వాసంతి సాహిత్య పాల్గొన్నారు.

కంది సాగులో మెలకువలు పాటించాలి

రాప్తాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కంది సాగులో మెలకువలు పాటించాలని ఏడీఏ రవి తెలిపారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ కందిలో తెగుళ్లు ఎక్కువగా వ్యాపిస్తున్నాయన్నారు. వ్యవసాయ అధికారుల సలహా మేరకు సకాలంలో మందులు పిచికారీ చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. పంటల బీమా పథకం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్‌రెడ్డి, సిబ్బంది గౌస్‌బాషా, రాజు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

అనంతపురంరూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరు, జంగాపల్లి గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఏఓ శశికళ ఇతర అధికారులు హాజరై కంది, టమోటా పంటలను పరిశీలించారు. పంటను ఆశించిన పురుగుల గురించి రైతులకు తెలియజేశారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి రామాంజనేయులు, ఏపీఎంఐసీ అధికారి హరిత, ఏఈఓ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి ఉచిత కోచింగ్

అనంతపురం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్‌ను ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినట్లు టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామిదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు ఉచిత డీఎస్సీ కోచింగ్ ఇవ్వాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా రాష్ట్రంలోని ప్రముఖ ప్రైవేటు సంస్థలలో ఒప్పందం కుదుర్చుకొని విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని డీఎస్సీ రాసే అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు సురక్షిత నీరు అందిస్తాం

రాప్తాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల్లో పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామని మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని ప్రసన్నాయపల్లి గ్రామంలో బుధవారం వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ప్రసన్నాయపల్లి గ్రామ ప్రజలు సురక్షిత తాగు నీరు అందించాలని పరిటాల సునీతను కోరారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తక్కువ కాలంలోనే వాటర్ ప్లాంట్ ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ కొండప్ప, నాయకుడు శ్రీనివాసులు, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌ను కలిసిన పరిటాల సునీత



బీఆర్‌నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న సునీత

అనంతపురం అర్బన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో బీఆర్‌నాయుడుకు శాలువ కప్పి, పుష్పగుచ్చం అందజేసి సన్మానించడంతోపాటు శుభాకాంక్షలు తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోండి

అనంతపురం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులు, మూగ జీవాలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ ఆదేశించారు. గుంటూరు నుంచి పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, డీడీలు, ఏడీలు, వెటర్నరీ డాక్టర్లతో ఆయన బుధవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిర్దేశించిన సమయాల్లో వ్యాక్సినేషన్ ప్రక్రియలను పూర్తి చే యాలన్నారు. పశుగణనను పక్కాగా నిర్వహించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ పథకాలను అర్హులైన రైతులకు అందేలా చూడాలన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

శింగనమల నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను శింగనమల ఎస్ఐ శరత్ చంద్ర సీజ్ చేశారు. బుధవారం కల్లుమడి ప్రాంతం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా మూడు ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి శింగనమల పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాధిత కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలి

అనంతపురం సెంట్రల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఎల్లుట్ల గ్రామ బాధిత కుటుంబాల సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలివ్వాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రవిరాజ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించానని తెలిపారు. బాధితుల కుటుంబాలన్నీ వ్యవసాయ కూలీ పనులపై ఆధారపడ్డాయన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలిచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శాంతకుమార్, అశోక్‌కుమార్, విశ్వనాథ్‌గౌడ్, సత్యమయ్య పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : ఆర్జేడీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ

రాప్తాడు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్ తెలిపారు. మండలంలోని రాప్తాడు ఉన్నత పాఠశాలను బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. భోజనం, విద్య, తదితర సౌకర్యాలు ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పేద విద్యార్థులు చదువుకునేందుకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం : డీఎస్పీ

అనంతపురం విద్య, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ వాడటం, వాటిని అలవాటు చేసుకోవడం వల్ల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని, వాటికి దూరంగా జీవించాలని డీఎస్పీ మహబూబ్ బాష పేర్కొన్నారు. బుధవారం గ్లోబల్ జూనియర్ కళాశాలలో డ్రగ్స్, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలతో బంగారు భవిష్యత్తును విద్యార్థులు కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. బాల్య వివాహాలను సైతం ప్రతి ఒక్కరూ నియంత్రించాలన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ కళాశాల డీన్ ఆంజనేయులు, కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

అమిగోస్‌పై చర్యలు తీసుకోండి

బుక్కరాయసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ యజమానులపై వేధింపులు పాల్పడుతున్న అమిగోస్ మినరల్స్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఓ. నల్లప్ప డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ట్రాక్టర్ యాజమానులతో కలిసి సీపీఎం నేతలు తహసీల్దార్ పుణ్యవతికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ అమిగోస్ ప్రైవేటు కంపెనీకి ప్రభుత్వం మైనింగ్ శాఖను ధారాదత్తం చేసిందని మండిపడ్డారు. మట్టి, రాళ్లు, తదితర వంటివి ట్రాక్టర్లు ద్వారా తరలిస్తున్న వాటిపై రాయల్టీలు, పెనాల్టీల పేరుతో చేస్తున్న వేధింపులు ఆపాలన్నారు. అమిగోస్ మినరల్స్ సంస్థ చెల్లించాల్సిన రూ. 150 కోట్లను వెంటనే ప్రభుత్వానికి చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు కుళ్లాయప్ప పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బుక్కరాయసముద్రం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): క్రీడలతో పోలీసు సిబ్బందికి మానసిక ఉల్లాసం కలుగుతుందని జేఎన్‌టీయూ స్పోర్ట్స్ అధికారి జోజిరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని జంతులూరు ఏపీఎస్పీ పోలీసు 14వ బెటాలియన్ మూడో వార్షికోత్సవం సందర్భంగా పోలీసు సిబ్బందికి స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ పోటీల్లో పోలీసు సిబ్బంది వివిధ క్రీడల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం స్పోర్ట్స్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జోజిరెడ్డి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత కల్గి ఉందన్నారు. పోలీసు శాఖలో సిబ్బందికి పని ఒత్తిడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కమాండెంట్ ప్రభుకుమార్, అడిషనల్ కమాండెంట్ కేశవరెడ్డి, డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్వీసు రోడ్డు లేక ప్రమాదాలు

శింగనమల, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అనంతపురం- తాడిపత్రి జాతీయ రహదారిలో వంతెనలు నిర్మిస్తున్న చోట తారుతో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. సర్వీస్ రోడ్డు మట్టితో వేయడంతో వాహనదారులు కిందపడి గాయాలపాలవుతున్నారు. బుధవారం ఒక్కరోజే ఎస్ఆర్ఐటీ దగ్గర నిర్మిస్తున్న బ్రిడ్జి వద్దనే మూడు ప్రమాదాలు జరిగాయి. శింగనమల మండలంలోని సి.బండమీదపల్లి గ్రామ వీఆర్ఏ వెంకటేశ్ ద్వి చక్రవాహనం అదుపు తప్పి కిందకు పడడంతో కాలు విరిగింది. అలాగే శింగనమల వీఆర్ఓ ఎర్రితాతయ్య శింగనమల జిల్లా పరిషత్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయరాలు ద్విచక్ర వాహనం సర్వీస్ రోడ్డులోని బురదలో అదుపు తప్పి గాయపడ్డారు. ప్రతి రోజు ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు బ్రిడ్జిల నిర్మాణాల వద్ద తారు రోడ్డు వేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను జయప్రదం చేయండి

అనంతపురం విద్య, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. బుధవారం మహాసభల పోస్టర్లను ఆ సంఘం కార్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గేయానంద్ మాట్లాడుతూ యూటీఎఫ్ ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో ప్రాథమిక విద్యను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందని, హైస్కూళ్లలో సమాంతర మాధ్యమం కొనసాగించాలని, అనవసర యాప్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాయదుర్గంలో డిసెంబర్ 1న యూటీఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు గోవిందరాజులు, లింగమయ్య, గంగాధర్, శివరుద్రప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

క్లుప్తంగా..

సీఎం పర్యటనకు తరలిరండి

డీ.హీరేహాళ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ మండలం నేమకల్లు గ్రామంలో ఈ నెల 30వ తేదీ శనివారం చేపట్టనున్న పింఛన్ పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారని మండల కన్వీనర్ హనుమంతరెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

వడ్డీతోనే రెన్యువల్ చేసుకోవాలి

శెట్టూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంగారం తాకట్టు పెట్టిన రైతులకు అసలుతో సంబంధం లేకుండా వడ్డీ కట్టించుకోవాలని టీడీపీ ఎంపీటీసీ లింగప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మండలంలోని ములకలేడు గ్రామంలో యూనియన్ బ్యాంకు వద్ద బుధవారం రైతులతో కలిసి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూనియన్ బ్యాంకులో బంగారం తాకట్టుపెట్టిన రైతులు వడ్డీ, అసలు కట్టి రెన్యువల్ చేసుకోవాలని సిబ్బంది చెప్పారన్నారు. కానీ రైతులు ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వడ్డీ మాత్రమే తీసుకుని రెన్యూవల్ చేయించుకోవాలని కోరారు. అనంతరం మేనేజర్‌కి వినతిపత్రం అందజేశారు. నాయకులు దొడ్డయ్య, బొజ్జప్ప, సిద్దారెడ్డి, ఎర్రిస్వామి, లక్ష్మమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు. వీరికి టీడీపీ ఎంపీటీసీ లింగన్న తలారి ప్రభాకర్, టీజే నరసింహమూర్తి మద్దతు తెలిపారు.

అవకతవకలపై విచారణ చేపడతాం

ఉరవకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉరవకొండ మేజర్ పంచాయతీలో అవకతవకలపై సమగ్ర విచారణ చేపడతామని డీపీవో నాగరాజునాయుడు పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పంచాయతీలో జరిగిన అక్రమాలపై టీడీపీ మద్దతు వార్డు సభ్యులు ఫిర్యాదు చేశారని తెలిపారు. జేసీబీ బిల్లులు, హైమాక్స్ లైట్లు ఏర్పాటులో ప్రజాధనం దుర్వినియోగమైందని చెప్పారన్నారు. వాటిపైన విచారణ కోసం ఈవో ఆర్డీని నియమించామన్నారు. అలాగే పంచాయతీ స్థలాన్ని అమ్మిన వార్డు సభ్యుడిపై కూడా ఫిర్యాదు అందిందన్నారు. ఇందుకు ఆ రిజిస్ట్రేషన్ రద్దయ్యేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించామన్నారు. ఈవోఆర్డీ దామోదర్‌రెడ్డి, కార్యదర్శి గౌస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కుందుర్పి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతపురం గ్రామ శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. తెనగల్లు గ్రామానికి చెందిన లింగప్ప వ్యక్తిగత పని నిమిత్తం బైక్‌లో కుందుర్పికి వచ్చాడు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. మహంతపురం సమీపంలో కర్ణాటకలోని సానులకుంట గ్రామానికి చెందిన ధనుంజయ మరో బైక్‌లో ఎదురుగా వస్తున్నాడు. ప్రమాదవశాత్తూ ఇద్దరి బైకులు పరస్పరం ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో కుందుర్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బోయిలపల్లి సమీపంలో ఒకరికి..

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని బోయిలపల్లి సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. కళ్యాణదుర్గం పట్టణానికి చెం దిన రమేష్ తన భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి ఆటోలొ గొల్లపల్లికి వ్యక్తిగత పనుల నిమిత్తం వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణంలో బోయిలపల్లి సమీపంలో ఆటో టైరు పేలి బోల్తా పడింది. ఈ ఘటనలో రమేష్ గాయపడ్డాడు. కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బిందుసేద్యం పరికరాల పంపిణీకి చర్యలు

బెళుగుప్ప, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వం సబ్సిడీతో బిందు సేద్యం పరికరాల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. మండలంలోని నరసాపురం, నక్కలపల్లి, శ్రీరంగాపురం, గుండ్లపల్లి గ్రామాల్లో రైతులకు బుధవారం ఏపీడీ తమ సిబ్బందితో కలిసి బిందు సేద్య పరికరాల గురించి అవగాహన కల్పించారు. బిందు సేద్యం పరికరాల వల్ల నీరు పొదుపు అవుతుందని, దీంతో పాటు పంటలకు తెగుళ్ల సోకకుండా మంచి దిగుబడులు సాధించవచ్చని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిరుత దాడిలో దూడ మృతి

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): చిరుత దాడిలో ఆవుదూడ మృతి చెందిన సంఘటన మండలంలోని గూబనపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తిమ్మరాజు తన పశువుల పాకలో ఆవుదూడను కట్టేశాడు. కాగా బుధవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో చిరుత ఆ దూడపై దాడి చేసింది. పశువుల పాకలోకి రైతు వెళ్లి చూడగా దూడ కనిపించలేదు. చుట్టుపక్కల వెతకడంతో దాదాపు వంద మీటర్ల దూరంలో దూడ కళేబరం కనిపించింది. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు ఘటనా స్థలిని పరిశీలించారు. దూడ కళేబరానికి అక్కడే పంచనామా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో అధికారులు రామ్మూర్తి, షానవాజ్, నగేష్ నాయక్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కణేకల్లు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో ప్రతిభను వెలికితీయడానికి నిర్వహించిన క్విజ్ పోటీల్లో కణేకల్లు జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు తమ ప్రతిభను కనబరిచారు. జోనల్‌స్థాయి క్విజ్ పోటీలలో 10వ తరగతి విద్యార్థినులు ఫిర్దోష్, సుస్మిత ద్వితీయస్థానంలో గెలిచి అవార్డులు అందుకున్నారు. వీరి విజయం పట్ల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు రుక్మిణి, భాగ్యలక్ష్మి హర్షం వ్యక్తం చేశారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రానివ్వను

● ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి

యాడికి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవికి ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా చేస్తామని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎన్. తిమ్మాపురం, యాడికి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై గ్రామ పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో వివరాలడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ప్రజలకు ఎంతమేరకు నీరు అవసరం, ప్రస్తుతం ఎంతమేరకు సరఫరా చేస్తున్నారు, ఎన్నిరోజులకు ఒకసారి నీటిని అందిస్తున్నారని ఆరా తీశారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, ఎక్కడా మురుగునిల్వ ఉండకూడదని గ్రామ పంచాయతీ సిబ్బందికి సూచించారు. యాడికిలో నీటి పంపింగ్ స్టేషన్‌ను, ప్రభుత్వ ఆస్పత్రిని తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ వేసవిలో మండలంలోని ఏ ఒక్క గ్రామంలో కూడా తాగునీటి సమస్య రాకుండా చేస్తామన్నారు. దీనికోసం ముందస్తు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ కాలువలు లేనిచోట కాలువలు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీఓ వీరరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ప్రభాకర్‌రెడ్డి, జేఈ దేవకుమార్, ఈఓపీఆర్‌డీ శశికళ, పీఆర్ ఏఈ యల్లమనాయుడు, యాడికి సర్పంచ్ అనూరాధ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశ్మిత్‌రెడ్డి

నేమకల్లు అంజన్న సేవలో ప్రముఖులు



ఆంజనేయుడి ఆలయంలో ప్రభుత్వ విప్, కలెక్టర్

బొమ్మనహాళ్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామిని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, సీఎంఓ టూర్ కోఆర్డినేటర్ ఇక్బాల్ షకీల్, కలెక్టర్ వినోద్‌కుమార్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఘన స్వాగతం పలికి స్వామి దర్శనం చేయించి పూజలు, అర్చనలు జరిపించారు. తర్వాత తీర్థప్రసాదాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఆలయ విశిష్టతను కాలవ శ్రీనివాసులు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు తెలియజేశారు. వారివెంట పలువురు నాయకులు, అధికారులు ఉన్నారు.

బాల్యవివాహాలతో భవిష్యత్తు అంధకారం: సీడీపీఓ



కళ్యాణదుర్గంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న

కళ్యాణదుర్గం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారం అవుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీప్రసన్న తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బాల్యవివాహ ముక్త్ భారత్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్యవివాహాల వలన జరిగే అనర్థాలను వివరించారు. బాల్య వివాహ నిరోధక చట్టం గురించి తెలియజేశారు. బాల్యవివాహాలతో బాలికలు మానసికంగా, శారీరకంగా అనారోగ్యాల పాలవుతారని అన్నారు. వారి భవిష్యత్తు అంధకారమవుతుందని తెలిపారు. కనుక బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. అనంతరం ముక్త్ భారత్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యుడు రాజేష్, సూపర్‌వైజర్ భారతి, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెళుగుప్ప: బాలికల చైతన్యంతోనే బాల్యవివాహాలు అరికట్టడం సాధ్యమవుతుందని వైద్యాధికారి కార్తీకరెడ్డి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని కేజీబీవీలో ఎస్‌వో నాగరత్నబాయి అధ్యక్షతన బాల్యవివాహాల రహిత ఆంధ్రప్రదేశ్‌పై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో వైద్యాధికారి మాట్లాడుతూ.. బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకమంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఏఎన్‌ఎం రాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బంజారాలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పించాలి



చంద్రబాబును కలిసిన కేశవ నాయక్

ఉరవకొండ, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బంజారాలకు ఎమ్మెల్సీ స్థానాన్ని కేటాయించాలని బంజారా సంఘం జాతీయ నాయకుడు కేశవనాయక్ సీఎం చంద్రబాబును కోరారు. అమరావతిలో ఆయన సీఎంను బుధవారం కలిసొ బంజారా సంప్రదాయ రీతిలో ఎర్రతల పాగాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. చట్టసభల్లో బంజారాలకు సముచితస్థానం కల్పించాలని విన్నవించారు. గుత్తి సమీపంలోని సేవాఘడ్ అభివృద్ధికి రూ.15లక్షలు నిధుల కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు తులసీదాస్ నాయక్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ



ప్రతిభావంత విద్యార్థినులతో ప్రిన్సిపాల్, టీచర్లు

ఉరవకొండ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరచారు. గుంటూరు జిల్లా వీఆర్ పురంలో ఈ నెల 25, 26వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గురుకుల పాఠశాలకు చెందిన మాన్యశ్రీ, అమృతలక్ష్మీ అనే విద్యార్థులు పాల్గొన్నారు. అందులో వారు రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా ఉండేందుకు స్మార్ట్ అగ్రికల్చర్ యాప్‌ను రూపొందించి ప్రదర్శించారు. వారి ప్రదర్శనకు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం దక్కిందని ప్రిన్సిపాల్ జ్ఞానప్రసూన తెలిపారు. ఇటీవల రాయలసీమ జోనల్ స్థాయిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో కూడా ఈ విద్యార్థులు ప్రతిభ చాటారని అన్నారు. ఈ విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు.

జోనల్‌స్థాయి పోటీల్లో ప్రతిభ

గుంతకల్లుటౌన్: జోనల్ స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీల్లో పట్టణంలోని రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం నిర్మల్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడపలో గత మంగళవారం నిర్వహించిన జోనల్‌స్థాయి క్విజ్, వ్యాచరచనపోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పవన్, యశ్వంత్ పాల్గొన్నారన్నారు. వ్యాసరచన పోటీలో పవన్ మొదటి స్థానంలో క్విజ్ పోటీలో యశ్వంత్ మొదటి స్థానంలో నిలిచారన్నారు. వీరికి కడప జిల్లా విద్యాశాఖ అధికారి మీనాక్షి, జోనల్‌స్థాయి అధికారులు జ్ఞాపికలను అందించారని అన్నారు. ప్రతిభ కనభరిచిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

శివుడి విగ్రహ ఏర్పాటు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద సర్కిల్లో 20అడుగుల శివుడి విగ్రహ ఏర్పాటు పనులను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ.. త్వరగా విగ్రహాన్ని ఏర్పాటు చేసేవిధంగా చూడాలన్నారు. నిత్యం వేలాదివాహనాలు తిరుగుతుంటాయని ఇక్కడ ఎలాంటి సంఘటనలు జరగకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటుచేయాలని సంబంధితాధికారులకు సూచించారు. అదేవిధంగా చుక్కలూరు రహదారి, సజ్జలదిన్నె, కడపరహదారుల్లో ఏర్పాటు చేయనున్న విగ్రహాల పనులు ఎప్పుడు చేపడతారని కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, సంజీవపురం పవన్, హరినాథ్‌రెడ్డి, యుగంధర్, సోమశేఖర్‌నాయుడు ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

ఆటో డ్రైవర్లు కుటుంబం కోసమైనా రోడ్డుభద్రతా నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉండాలని జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. స్థానిక తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదన్నారు. ఆటోల్లో ముందర డ్రైవర్ సీటు మాత్రమే ఉండాలన్నారు. కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని అయినా రోడ్డు నింబంధనలు పాటించి వాహనాలు నడపాలని తెలిపారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడి పూజ

యల్లనూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలో పడి పూజను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురుస్వామి రవినారాయణస్వామి గణపతి, కుమార స్వామి, అయ్యప్పస్వామి విగ్రహాలకు ప్రత్యేక అలంకరణలు చేశారు. తర్వాత పడి పూజ నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే సాయంత్రం అయ్యప్ప స్వామి గ్రామోత్సవాన్ని మాలధారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి పురవీధుల్లో ఊరేగించారు.

బెళుగుప్ప : మండలంలోని ఎర్రగుడిలో అయ్యప్పస్వామి గ్రామోత్సవ పూజను మాలాధారులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత సన్నిధానంలో గురుస్వామి శ్రీనివాసరెడ్డి అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక వాహనంలో స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. మాలధారులు భజనలు చేశారు.

24 మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడిపత్రి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని ఆర్టీటీకాలనీలో బుధవారం రాత్రి ఓబులేసు నుంచి 24మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. తిప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓబులేసు ఆర్టీటీకాలనీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడిచేసి ఓబులేసును అరెస్ట్‌చేసి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే అతడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బంగారు దుకాణాల మూసివేత

తాడిపత్రి, నవంబరు27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెయిన్‌బజారులో ఉన్న బంగారు దుకాణాలు బుధవారం మూతపడ్డాయి. వాణిజ్యపన్నుల శాఖ అధికారులు వచ్చారని దావానంలా వ్యాపించడంతో దుకాణదారులు ఒక్కసారిగా షాపులను మూసివేశారు. దీంతో మెయిన్‌బజారు నిర్మానుష్యంగా మారింది. చివరికి అధికారులు ఎవరూ రాకపోవడంతో సాయంత్రం షాపులు తెరిచారు.

బుడగ జంగాలకు ఇళ్ల స్థలాలివ్వాలి: సీపీఐ



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

రాయదుర్గం రూరల్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాల వారికి ఇళ్ల స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణం కూడా చేపట్టాలని సీపీఐ తాలూకా కార్యదర్శి నాగార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆయన పలువురు నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బేడ బుడగ జంగాల కులాన్ని గుర్తించి వారి పిల్లలకు చదువులతో పాటు ఉద్యోగాలు కల్పించాలని, ప్రభుత్వ పథకాలు వర్తింప చేయాలని కోరారు. రాయదుర్గం పట్టణంలోనే గత 60 ఏళ్లగా వారు జీవనం సాగిస్తున్నప్పటికీ ఇంతవరకు సొంత ఇళ్లు లేవన్నారు. వారికి ఓ చోట ఇంటిస్థలాలు కేటాయించి ఇళ్లు కూడా ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు. అనంతరం ఈ మేరకు తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి క్రాంతిష్, ఏపీరైతు సంఘం అధ్యక్షకార్యదర్శులు తిప్పేస్వామి, నరసింహులు, ఆంధ్రప్రదేశ్ మహిళా సమైఖ్య రాయదుర్గం తాలూకా ప్రధాన కార్యదర్శి పార్వతి, బేడ బుడగ జంగాల వారు పాల్గొన్నారు.

పోలీస్ భద్రత నడుమ మున్సిపల్ సమావేశం



గుత్తి మున్సిపల్ కార్యాలయం వద్ద పోలీసులు

గుత్తి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ సాధారణ సమావేశం పోలీస్ భద్రత మధ్య జరిగింది. కాగా ప్రశాంతంగా కొనసాగడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. చైర్‌పర్సన్ వన్నూర్‌బీ, కమిషనర్ జబ్బర్‌మీయా అధ్యక్షతన సమావేశం జరిగింది. గత నెలలో జరిగిన సమావేశంలో చైర్‌పర్సన్‌తోపాటు, కౌన్సిలర్లు సమావేశాన్ని జరగకుండా బహిష్కరించారు. ఈ దఫా కూడా ఏమైన ఉద్రిక్తత నెలకొంటుందన్న నెపంతో సీఐ వెంకటేశ్వర్లు భద్రత కల్పించారు. పోలీస్ పహారాలోనే సమావేశం కొనసాగింది. 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ అంచనాను రూ.19.19కోట్లతో ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ డీఈ హేమచంద్ర, మేనేజరు రాంబాబు, ఏఈ రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబుబ్ బాషా, టౌన్‌ప్లానింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా సమావేశం..

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళు శిల్ప అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం సజావుగా సాగింది. తొలుత కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ.. పట్టణంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ప్రస్తుతం తాగునీటి సరఫరా సక్రమంగా లేనందున ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తరచూ పైపులైను లీకేజీలు, మోటార్ల మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. మరొక కౌన్సిలర్ పద్మజ మాట్లాడుతూ మున్సిపల్ లేఅవుట్‌లలో కొంతమంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారే గానీ పట్టాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి కారణంగా లబ్ధిదారుల స్థలాలు కబ్జాకు గురవుతున్నట్లు వాపోయారు. తహసీల్దార్ నాగరాజు మాట్లాడుతూ డిసెంబరు నెలాఖరు లోపు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేస్తామని తెలిపారు. అలాగే పలువు కౌన్సిలర్లు వార్డుల్లో వివిధ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం అజెండాలోని అంశాలన్నింటిని ఆమోదించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు వలిబాషా, మున్సిపల్ డీఈ రవిప్రకాష్‌నాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు దిత పాల్గొన్నారు.

30 వ తేదీనే పింఛన్ పంపిణీ

రాయదుర్గం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 30వ తేదీనే నిర్వహించాలని ఎంపీడీఓ కొండన్న బుధవారం ప్రకటనలో తెలిపారు. ఒకటవ తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగానే పింఛన్ పంపిణీ నిర్వహించాలన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 5 గంటలకు నూరు శాతం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఫింఛన్‌దారులు ఒకటో నెల, రెండవ నెల ఫింఛన్ తీసుకోకపోతే ఒకేసారి మూడో నెల మూడునెలలకు సంబంధించిన మొత్తాన్ని పింఛన్ తీసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థినులు సత్ప్రవర్తనతో మెలగాలి

గుత్తి,నవంబరు27(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు సత్ప్రవర్తనతో మెలగాలని, బాగా చదువుకొని తల్లిదండ్రులకు కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి కాశీవిశ్వనాథాచారి సూచించారు. పట్టణంలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల గురుకుల పాఠశాలలో బాల్యవివాహ ముక్త భారత్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు బాగా చదివి ఉన్నత స్థాయిలో రాణించి తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ డిల్లీశ్వరి, ప్రిన్సిపాల్ విజయలత, సూపర్‌వైజర్ నాగేశ్వరి, న్యాయవాది గంగాధర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాడిపత్రి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించినట్లు ఈఓ రామాంజనేయులు తెలిపారు. గతేడాది నవంబరు 21నుంచి 27-11-2024వరకు భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకల్ని లెక్కించామని తెలిపారు. రూ.8,58,283 ఆదాయం వచ్చిందన్నారు. కార్యక్రమంలో అర్చకులు శంకరయ్య, గిరీష్, సహదేవశర్మ, చవ్వా రంగనాథరెడ్డి, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

755 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు బుధవారం 755 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లల హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ - 2కు 946 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.661 టీఎంసీల నీటి నిల్వ వున్నట్లు వారు పేర్కొన్నారు.

ప్రారంభం కాకనే శిథిలావస్థకు..

● 20 ఏళ్ల క్రితం నిర్మితమైన తాగునీటి ట్యాంకు

● ఇప్పటికీ ప్రారంభం కాని వైనం



శిథిలావస్థకు చేరుతున్న తాగునీటి ట్యాంకు

గుంతకల్లుటౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి పంచాయతీ ఎన్ కొట్టాల గ్రామంలో తాగునీటి ట్యాంకు ప్రారంభం కాకుండానే శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 20 ఏళ్ల క్రితం ట్యాంకును నిర్మించారు. ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధులు మారినా ట్యాంకు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో దిష్టిబొమ్మలా ట్యాంకు దర్శనమిస్తోంది. గ్రామంలో దాదాపు 150 గృహాలు ఉన్నాయి. తాగునీటి సౌకర్యార్థం 20ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో తాగునీటి ట్యాంకును నిర్మించారు. ఇప్పటి వరకు ప్రారంభించలేదు. పట్టించుకునేవారు లేక ట్యాంకు శిథిలావస్థకు చేరింది. ట్యాంకు చుట్టు పక్కల నివాసగృహాలు ఉన్నాయి. కొద్దిగా గాలి వచ్చినా ట్యాంకు సిమెంట్ పెచ్చులూడి పడుతోంది. ప్రతి రోజూ ఎప్పుడూ ఏప్రమాదం జరుగుతుందో అంటూ బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ట్యాంక్ మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు కోరుతున్నారు.